RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -230 పేజీలు - 08 వెల - 04/- శనివారం 21 జూన్ 2025

# 'యోగాంధ్ర'కు సర్వం సిద్ధం



విశాఖలో నేడు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం



- హాజరుకానున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- సాగర తీరంలో 5 లక్షల మందితో యోగాసనాలు, ప్రపంచ రికార్డు లక్ష్యం
- ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు 34 కిలోమీటర్ల మేర కార్యక్రమం
- రూ.62 కోట్ల వ్యయంతో ఏర్పాట్లు, పటిష్ట భద్రతా చర్యలు
- వర్షం వస్తే ప్రత్యామ్నాయంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం సిద్ధం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని "యోగాంధ్ర 2025" కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. జూన్ 21వ తేదీన (శనివారం) విశాఖ సాగర తీరంలో జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా యోగాసనాలు వేయనున్నారు.

# సినిమా డైలాగులు హాలు వరకే బాగుంటాయి



- మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- అసాంఘిక శక్తులకు మద్దతుగా
- మాట్లాడడం కూడా నేరమే... అది మర్చిపోవద్దు
- సినిమా డైలాగులు నిజ జీవితంలో కుదరవని హితవు
- అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిక
- శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం

2లో



2లో

# ఇంగ్లీష్ వద్దనడం పేదలను చులకన చేయడమే

వారిని ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర -ఇంగ్లీష్ ఒక వారధిలాంటి భాష మాత్రమే అమిత్ వాఖ్యలకు రాహుల్ కౌంటర్

# చర్చలకు సిద్ధం..

## కానీ ఆ హక్కులు వదులుకునే ప్రసక్తి లేదు: రేవంత్ రెడ్డి

- గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చలకు సిద్ధమన్న రేవంత్ రెడ్డి
- పీఎఫ్ఆర్ ఇచ్చే ముందు తెలంగాణను సంప్రదించకపోవడమే వివాదానికి కారణమని వెల్లడి
- ఈ నెల 23న కేబినెట్ సమావేశం అనంతరం ఏపీని చర్చలకు ఆహ్వానిస్తామన్న సీఎం
- రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని స్పష్టీకరణ



**హైదరాబాద్,జూన్20 ఆంధ్ర ప్రగతి**

గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరితోనూ వివాదాలు కోరుకోవడం లేదని, అయితే తెలంగాణ హక్కులను మాత్రం వదులుకునే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి, పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలుత తెలంగాణను సంప్రదించకుండా నేరుగా కేంద్ర ప్రభుత్వానికి ప్రాథమిక సాధ్యసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్) సమర్పించడమే ప్రస్తుత వివాదానికి మూలకారణమని రేవంత్ రెడ్డి అన్నారు. మిగతాది 2లో...

25 వేల మంది విద్యార్థులతో

# సూర్యనమస్కారాల ప్రపంచ రికార్డు...



2లో

- ఇది గర్వించాల్సిన రోజన్న మంత్రి నారా లోకేశ్
- విశాఖలో విద్యార్థుల అపూర్వ యోగా ఘట్టం
- గిరిజన విద్యార్థుల ప్రతిభను కొనియాడిన మంత్రి నారా లోకేశ్
- ప్రధాని మోదీకి కానుకగా గిన్నిస్ రికార్డును అందిస్తామని వెల్లడి

జగన్ పర్యటన సందర్భంగా మృతి చెందిన

# సింగయ్య కుటుంబానికి రూ. 10 లక్షల చెక్

అందించిన అంబటి

సింగయ్య మృతిని కూటమి ప్రభుత్వం రాజకీయం చేస్తోందన్న అంబటి



కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని పార్టీ నేతల హామీ పల్నాడు జిల్లాలో వైసీపీ అధినేత జగన్ పర్యటన సందర్భంగా జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఆ పార్టీ కార్యకర్త మృతిచెందడం విషాదాన్ని నింపింది. మిగతాది 2లో...



2లో

# అమెరికా పర్యటన కంటే ఒడిశాకే ప్రాధాన్యత

- ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా.. నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు
- ఒడిశాలో బీజేపీ ప్రభుత్వ మొదటి ఏడాది పాలనను కొనియాడిన ప్రధాని

# వైజాగ్‌కు కాగ్నిజెంట్

- 1,582 కోట్ల పెట్టుబడి.
- 8,000 ఉద్యోగాలు
- ఐటీ క్యాంపస్ ఏర్పాటుకు సుముఖత
- ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం
- 2029 నాటికి కార్యకలాపాలు ప్రారంభం
- విశాఖలో ఎకరా 99 పైసలు చొప్పున
- 21.31 ఎకరాల కేటాయింపు: లోకేశ్



2లో

# 'యోగాంధ్ర'కు సర్వం సిద్ధం





(మొదటి పేజీ తరువాయి)

విమానాశ్రయం నుంచి ప్రధాని నేరుగా ఐఎన్ఎస్ డేగాకు చేరుకుని, అక్కడి నుంచి నౌకాదళ అతిథిగృహానికి వెళ్లారు. ఈ రాత్రి ఆయన అక్కడే బస చేస్తారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం విశాఖపట్నం ఆర్కే బీచ్ రోడ్డులో నిర్వహించే భారీ యోగాంధ్ర కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని యోగాసనాలు వేయనున్నారు. కార్యక్రమాలు ముగిసిన అనంతరం, ఉదయం 11:50 గంటలకు ఆయన ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రధాని పర్యటన నేపథ్యంలో విశాఖ నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

సుమారు 5 లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, తద్వారా ప్రపంచ రికార్డు సృష్టించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

**సాగర తీరం వెంబడి అపూర్వ ఘట్టం**

ఈ మెగా ఈవెంట్ కోసం విశాఖ ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి విజయనగరం జిల్లా భోగాపురం వరకు సుమారు 34 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని యోగా వేదికగా తీర్చిదిద్దారు. బీచ్ రోడ్డులో మొత్తం 326 కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేశారు. ప్రతి 40 అడుగులకు ఒక చిన్న వేదికను నిర్మించారు. ఈ ఏర్పాట్ల దృష్ట్యా, శుక్రవారం (జూన్ 20) నుంచే బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి ముందుగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి, క్యూఆర్ కోడ్ ద్వారా ప్రవేశం కల్పిస్తారు. ప్రతిఒక్కరికీ ఉచితంగా యోగా మ్యాట్, టీ షర్టులు అందజేస్తారు.

**రూ.62 కోట్లతో విస్తృత ఏర్పాట్లు**

సుమారు 62 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పాల్గొనేవారి సౌకర్యార్థం 3 వేల తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ప్రతి ఐదు కంపార్ట్‌మెంట్‌లకు ఒక వైద్య శిబిరాన్ని, ప్రధాన వేదిక వద్ద పది పడకల తాత్కాలిక ఆసుపత్రిని సిద్ధం చేశారు. ప్రజల తరలింపు కోసం 3,600 ఆర్టీసీ బస్సులతో పాటు 7,295 ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేశారు.

**వర్షం వచ్చినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**

ఒకవేళ శనివారం వర్షం కురిస్తే, కార్యక్రమానికి అంతరాయం కలగకుండా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మైదానంలో సుమారు 20 వేల మంది గిరిజన విద్యార్థులతో ప్రత్యేక యోగా కార్యక్రమం కూడా జరగనుంది. ఇక్కడ కూడా పది పడకల ఆసుపత్రిని నిర్మించారు.

**భద్రత, పర్యవేక్షణ**

ప్రధాని పర్యటన నేపథ్యంలో విశాఖలో కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. మొత్తం 10 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, బీచ్ రోడ్డు వెంబడి 2 వేల సీసీ కెమెరాలను అమర్చారు. కార్యక్రమ పర్యవేక్షణకు 26 మంది ప్రముఖ యోగా గురువులు, 1500 మంది శిక్షకులు, 6300 మంది వాలంటీర్లు సేవలందించనున్నారు. తూర్పు నౌకాదళం కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటోందిబీ వారి ఆధ్వర్యంలో 11 యుద్ధ నౌకలపై యోగా సాధన చేయనున్నారు. ప్రధాని మోదీ కాన్వాయ్ కోసం ఐఎన్ఎస్ డేగ నుంచి కమాండ్ గెస్ట్ హౌస్ వరకు పోలీసులు ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గిన్నిస్ రికార్డు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర మంత్రి నారాయణ తెలిపారు. ప్రధాని మోదీ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, యోగా కార్యక్రమం కోసం బీచ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచామని ఆయన వివరించారు. ఈ అపూర్వ ఘట్టం ద్వారా యోగా ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటడమే లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.

# చర్చలకు సిద్ధం..

(మొదటి పేజీ తరువాయి)

"పీఎఫ్ఆర్ ఇచ్చే ముందే మాతో చర్చించి ఉంటే ఈ వివాదం ఉండేది కాదు. కేంద్రానికి ఏపీ నివేదిక ఇవ్వగానే, కేంద్రం కూడా అన్ని రకాల చర్యలకు సిద్ధమవుతోంది" అని ఆయన వివరించారు. ఈ అంశంపై చర్చించేందుకు తమకు ఎలాంటి భేషజాలు లేవని, ఇద్దరు ముఖ్యమంత్రులు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై మాట్లాడుకుందామని ఆయన సూచించారు. "ఒక రోజు కాదు, అవసరమైతే నాలుగు రోజులైనా చర్చిద్దాం. రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయి. న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు.

ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుందని, ఈ భేటీలో బనకచర్ల అంశంపై సమగ్రంగా చర్చించిన తర్వాత, ఆంధ్రప్రదేశ్‌ను అధికారికంగా చర్చలకు ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. "ఒక అడుగు ముందుకేసి మేమే ఏపీని చర్చలకు పిలుస్తాం. తెలుగువారి మధ్య అనవసరమైన సమస్యలు ఉండొద్దు. పైన, కింద ఉన్న రాష్ట్రాలతో వివాదం కోరుకోవట్లేదు" అని ఆయన అన్నారు. విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించుకునేందుకు ఇప్పటికే అధికారులు, మంత్రుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేసిందని ఆరోపించారు. "నీళ్లు, నిధుల పేరిట బీఆర్ఎస్ నేతలు మోసపూరిత సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకున్నారు. రాయలసీమను రత్నాలసీమ చేస్తానని కేసీఆర్ అన్నారు. గోదావరి జలాలను ఏపీ ఉపయోగించుకుంటే తప్పేంటని కూడా గతంలో వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను ఏపీకి రాసిచ్చింది కేసీఆర్, హరీశ్ రావులే" అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తాను కృష్ణా జలాల్లో 500 టీఎంసీలకు బ్లాంకెట్ ఎన్ఓసీ అడిగితే మాజీ మంత్రి హరీశ్ రావు తప్పుపడుతున్నారని, ఆయన వాదనలో పసలేదని అన్నారు. 2023లో కేంద్రానికి హరీశ్ రావు రాసిన లేఖలో కేవలం 405 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు అడిగారని గుర్తుచేశారు.

"విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉంది. బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు. దీనిపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే. గోదావరిలో 968 టీఎంసీలు వాడుకునే వెసులుబాటు తెలంగాణకు ఉంది. కానీ, కేటాయించిన నీటిని వాడుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంతోనే వివాదాలు తలెత్తుతున్నాయి" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడమే ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వివాద పరిష్కారానికి ఎలాంటి కాలపరిమితి లేదని స్పష్టం చేశారు. జూలై 6, 7 తేదీల్లో మరోసారి ఢిల్లీలో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. అధికారం కోల్పోయిన అసహనంతోనే హరీశ్ రావు విమర్శలు చేస్తున్నారని, తెలంగాణకు అన్యాయం చేసింది కేసీఆర్, హరీశ్ రావులేనని పునరుద్ఘాటించారు. కేటీఆర్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లైజనింగ్ అధికారిగా పని చేస్తున్నారని, కేసీఆర్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, అమిత్ షా గతంలో అన్నారని గుర్తుచేశారు. దీనిపై కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# 25 వేల మంది విద్యార్థులతో సూర్యనమస్కారాల ప్రపంచ రికార్డు...

విశాఖపట్నం**జూన్20 ఆంధ్ర ప్రగతి**

మనమంతా గర్వపడాల్సిన రోజని, యావత్ దేశంతో పాటు ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూసిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రపంచ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 25 వేల మంది విద్యార్థులు ఒకేసారి సూర్యనమస్కారాలు చేసి చరిత్ర సృష్టించారని ఆయన కొనియాడారు. కూటమి ప్రభుత్వం జూన్ 21న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా, శుక్రవారం విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లాకు చెందిన 25 వేల మంది గిరిజన విద్యార్థులు 108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేసి గిన్నిస్ రికార్డు సృష్టించే దిశగా అడుగులు వేశారు. ఈ రోజు గిరిజన విద్యార్థులను చూస్తుంటే వారి కమిట్‌మెంట్, పట్టుదల స్పష్టంగా కనిపిస్తున్నాయని మంత్రి లోకేశ్ ప్రశంసించారు. 108 నిమిషాల్లో 108 సూర్యనమస్కారాలు చేయడం అందరినీ ఆశ్చర్యపరిచిందని, ఒక్క పిలుపుతో వారంతా కష్టపడి దేశంతో పాటు ప్రపంచం మనవైపు చూసేలా చేసినందుకు ప్రభుత్వం తరపున విద్యార్థులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ చారిత్రాత్మక ప్రదర్శన ఒక ప్రపంచ రికార్డు అని, దీనిని శనివారం అధికారికంగా ప్రకటిస్తారని ఆయన వెల్లడించారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులందరికీ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి తరపున శుభాకాంక్షలు





తెలియజేశారు. విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎన్నడూ జరగని విధంగా నిర్వహించి చూపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోదీని కోరారని, అందుకు అనుగుణంగానే ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని లోకేశ్ గుర్తుచేశారు. శనివారం (జూన్ 21) జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో 5 లక్షల మంది పాల్గొని మరో గిన్నిస్ రికార్డు సృష్టించబోతున్నారని ఆయన ప్రకటించారు. యోగా అనేది కేవలం ఆసనాలు కాదని, అది మన జీవన విధానమని, మనందరికీ క్రమశిక్షణ నేర్పుతుందని మంత్రి లోకేశ్ అన్నారు. తాను కూడా విద్యార్థి దశలో ఉన్నప్పుడు తన తండ్రి చంద్రబాబు తనతో యోగా చేయించేవారని, ఉదయాన్నే నిద్రలేవడం మొదట్లో కష్టంగా అనిపించినా, ఆయన నేర్పించిన క్రమశిక్షణ, పట్టుదల వల్లే తాను ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నానని వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. అదే క్రమశిక్షణ, పట్టుదల ఈ విద్యార్థుల్లోనూ ఉందని, దానిని ఎప్పటికీ మరువొద్దని సూచించారు. ఆంధ్రులుగా మన కోరికలన్నీ ప్రధాని నరేంద్ర మోదీ తీరుస్తున్నారని మంత్రి లోకేశ్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపారని, విశాఖకు రైల్వే జోన్ ఇచ్చారని, నిలిచిపోయిన అమరావతి పనులను పునఃప్రారంభించారని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి అవసరమైన సంస్థలను కేటాయించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అన్నా, విశాఖ అన్నా ప్రధాని మోదీకి చాలా ప్రేమ అని, ఏడాదిలో రెండోసారి ఆయన విశాఖకు వస్తున్నారని గుర్తుచేశారు. ఆయనకు కానుకగా ఈ రోజు విద్యార్థులు సాధించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును అందిస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు.

ఈ విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదల చూస్తుంటే తన కుమారుడు దేవాన్ష్ గుర్తుకువస్తున్నాడని, ఈ లక్షణాలను దేవాన్ష్‌కు కూడా నేర్పించాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

## సినిమా డైలాగులు హాలు వరకే బాగుంటాయి

**● మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

అమరావతి/**జూన్20 ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో అప్రజాస్వామికంగా వ్యవహరించేవారిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించబోమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అటువంటి వారిని ప్రజలు నిశితంగా గమనించాలని, అసాంఘిక శక్తుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన హెచ్చరించారు. వైసీపీ అధినేత జగన్ సినిమా డైలాగులతో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పవన్ కల్యాణ్ గురువారం మీడియా ద్వారా స్పందించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలను కట్టడి చేయకపోగా, వాటిని సమర్థించేలా మాట్లాడే వారి నేరపూరిత ఆలోచనలను ప్రజలు గమనించాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడటం కూడా నేరమేనన్న విషయాన్ని ఎవరూ మరచిపోరాదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరూ సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సినిమాల్లో చెప్పే డైలాగులు సినిమా హాళ్ల వరకే బాగుంటాయని, వాటిని నిజ జీవితంలో అమలుచేస్తామంటే ప్రజాస్వామ్యంలో కుదరదని ఆయన హితవు పలికారు. చట్టం, నియమ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాల్సిందేనని నొక్కిచెప్పారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు మరింత జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించేలా ప్రవర్తించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని పోలీసులకు ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని, అవసరమైతే రౌడీషీట్లు తెరిచి అలాంటి వారిని అదుపులోకి తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## వైజాగ్‌కు కాగ్నిజెంట్

అమరావతి/**జూన్20 ఆంధ్ర ప్రగతి**,000 మందికి ఉద్యోగాల కల్పనతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే కాగ్నిజెంట్ సంస్థకు ఎకరా 99 పైసలు చొప్పున 21.31 ఎకరాలను కేటాయించాలని ఎస్ఐపీబీ తీర్మానించిందని లోకేశ్ వెల్లడించారు. కాగ్నిజెంట్ తన కార్యకలాపాలను 2029 నుంచి వైజాగ్‌లో ప్రారంభిస్తుందని తెలిపారు. విశాఖ పర్యటనలో కూడా మంత్రి లోకేశ్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఎప్పటి నుంచో కాగ్నిజెంట్ విశాఖపట్నం వస్తామని చెబుతోందని, ఇప్పుడది సాకారమైందని అన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాల కల్పన లక్ష్యానికి చేరువయ్యేలా చేస్తున్న కృషి ఫలిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రూ.1,370 కోట్ల పెట్టుబడులతో 12,000 మందికి ఉద్యోగాలు కల్పించేలా విశాఖలో కార్యాలయం స్థాపనకు టీసీఎస్ చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ కంపెనీకి కూడా ఎకరా 99 పైసలు చొప్పున దాదాపు 22 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ కూడా విశాఖలో రూ.1,582 కోట్ల పెట్టుబడితో దశలవారీగా 8,000 మందికి ఉద్యోగాలు కల్పించేలా క్యాంపస్ ఏర్పాటుకు సంసిద్ధత తెలిపింది. ఈ సంస్థకు కూడా కాపులుప్పాడలో స్థలం కేటాయించాలని నిర్ణయించారు. వీఎంఆర్‌డీఏ ఇందుకు సానుకూలంగా స్పందించింది. విశాఖకు ఈ రెండు కంపెనీల రాకతోనే 20,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇన్ని వేలమంది ఉద్యోగులతో పాటు వారి కుటుంబాలు విశాఖకు తరలి వస్తే నగర విస్తరణ, ఆర్థిక కార్యకలాపాలు ఏ స్థాయిలో పెరుగుతాయో ఊహించుకోవచ్చని లోకేశ్ పేర్కొన్నారు. కంపెనీల రాకతో విశాఖ నగరం రూపురేఖలు మారిపోతాయని ఐటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భౌగోళికంగా సముద్ర తీరాన ఉండటం, భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుండటం.. ఐటీ కంపెనీల రాకతో ముంబై తరహా కాస్మోపాలిటన్ సిటీగా విశాఖ మారుతుందని అంటున్నారు.

## జగన్ పర్యటన సందర్భంగా మృతి చెందిన సింగయ్య కుటుంబానికి రూ. 10 లక్షల చెక్

(మొదటి పేజీ తరువాయి)

వెంగళాయపాలెం గ్రామానికి చెందిన సింగయ్య అనే కార్యకర్త ఈ ప్రమాదంలో మరణించారు. ఈ దురదృష్టకర సంఘటన నేపథ్యంలో, వైసీపీ సీనియర్ నేతలు సింగయ్య కుటుంబాన్ని పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు వెంగళాయపాలెంలోని సింగయ్య నివాసానికి వెళ్లి, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా, పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రకటించిన రూ. 10 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును సింగయ్య భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ, "సింగయ్య వైసీపీ కార్యకర్త, జగన్ అభిమాని. జగన్ పర్యటనలో కారు ప్రమాదం కారణంగా ఆయన మరణించడం బాధాకరం. ఈ విషయం తెలిసిన వెంటనే జగన్ స్పందించి, సింగయ్య కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు.

## ఇంగ్లీష్ వద్దనడం పేదలను చులకన చేయడమే

న్యూఢిల్లీ,, **జూన్20 ఆంధ్ర ప్రగతి**ఇంగ్లీష్ మాట్లాడే వాళ్లు త్వరలోనే సిగ్గుపడాల్సి వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ శు క్రవారంనాడు తప్పుపట్టారు. దేశంలోని పేద పిల్లలను ఉన్నత విద్యకు దూరం చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తున్నాయని అన్నారు. 'ఇంగ్లీష్ అనేది డ్యామ్ కాదు, ఒక బ్రిడ్జి. ఇంగ్లీష్ అంటే సిగ్గు కాదు, పవర్. ఇంగ్లీషు అనేది ఒక చైన్ కాదు, చైన్‌లను బ్రేక్ చేసే పరికరం. ఇండియాలోని పేద పిల్లలు ఇంగ్లీష్ చదువుకోవడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఇష్టం లేదు. వాళ్లను ప్రశ్నించేవారు ఉండకూడదని వారు కోరుకుంటున్నారు. తమతో సమానంగా ఎదగడం కూడా వారికి ఇష్టం లేదని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రతిరోజూ ఇంగ్లీష్ మాట్లాడవద్దని,హిందీలో మాట్లాడమని చెబుతుం టారని, అయితే ఆర్ఎస్ఎస్, బీజేపీలోని పిల్లల మాత్రం ఇంగ్లీషు విద్యకు వెళ్తుంటారని, దీని వెనుక కారణమేమిటని రాహుల్ ప్రశ్నించారు. ఎందుకంటే పేద పిల్లలు బోర్డ్ రూముల్లోకి ఎంటర్ కారాదని, అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు రాకూడదని వారు కోరుకుంటున్నారని అన్నారు. వాళ్లు ఇంగ్లీషు స్కూళ్లకు వెళ్లి కాంటాక్టులు పెంచుకుంటారని, పేద పిల్లలకు మాత్రం తలుపులు మూసేస్తారని ఆక్షేపణ తెలిపారు.

## అమెరికా పర్యటన కంటే ఒడిశాకే ప్రాధాన్యత

**● ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా.. నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు**

**● ఒడిశాలో బీజేపీ ప్రభుత్వ మొదటి ఏడాది పాలనను కొనియాడిన ప్రధాని**

న్యూఢిల్లీ,, **జూన్20 ఆంధ్ర ప్రగతి**

అమెరికా పర్యటనకు రావాలంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి వచ్చిన ఆహ్వానాన్ని తాను సున్నితంగా తిరస్కరించానని, ఒడిశా పర్యటనకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఒడిశాలో పర్యటించిన ఆయన, జగన్నాథుని భూమికి రావడం తనకెంతో ముఖ్యమని పేర్కొన్నారు. అంతకుముందు బీహార్‌లో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న మోదీ, మధ్యాహ్నం ఒడిశా చేరుకుని రోడ్ షో, బహిరంగ సభలో పాల్గొన్నారు.

జీ7 సదస్సు కోసం కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ ఫోన్ చేసి, వాషింగ్టన్ మీదుగా వెళ్లాలని సూచించారని, విందులో పాల్గొని చర్చించుకుందామని చెప్పారని అన్నారు. "జగన్నాథుని క్షేత్రానికి వచ్చేందుకు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానాన్ని నేను వినమ్రంగా తిరస్కరించాను" అని మోదీ బహిరంగ సభలో వెల్లడించారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వ తొలి ఏడాది పాలనను ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించారు. "ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చింది. పూరీ జగన్నాథ ఆలయానికి చెందిన నాలుగు ద్వారాలను, రత్న భండార్‌ను తిరిగి తెరిపించింది" అని ఆయన అన్నారు.

ఈ పర్యటనలో భాగంగా, ప్రధాని మోదీ రూ.18,600 కోట్లకు పైగా విలువైన 105 అభివృద్ధి ప్రాజెక్టులను

## శక్తి యాప్ డౌన్లోడ్, రిజిస్ట్రేషన్ పై విద్యార్థులకు అవగాహన ఏర్పాటు.

**-మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జయరాములు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ జూన్ 20:** నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నేడు డిస్టిక్ హెడ్ క్వార్టర్ మరియు సబ్ డివిజనల్ శక్తి టీం ఇన్చార్జ్ ఇన్స్పెక్టర్ జయరాం గారు తన సిబ్బందితో ఎస్జీవోస్ కాలనీ నలంద జూనియర్ కాలేజ్ నందు అక్కడ చదువుతున్న ఆడపిల్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి తద్వారా శక్తి టీం ప్రాధాన్యత 112 మరియు 1930 సైబర్ నేరాలపై అవగాహన ఫోక్సో చట్టాలపై అవగాహన చైల్డ్ మ్యారేజెస్ ఈవ్ టీజింగ్ మరియు ర్యాగింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగినది. వన్ స్టాప్ సెంటర్ ప్రాధాన్యత గురించి వాళ్లకు అవగాహన కల్పించడం జరిగినది. అమ్మాయిల సెల్ ఫోన్లలో శక్తి యాప్ లో డౌన్లోడ్ చేసుకోవాలని వారికి శక్తి యాప్ యొక్క ప్రాధాన్యత గురించి వివరించడం జరిగినది. ఈ సందర్భంగా సబ్ డివిజనల్ శక్తి టీం మరియు డిస్టిక్ హెడ్ క్వార్టర్ శక్తి టీం సిబ్బంది పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమానికి సహకరించిన నలంద కాలేజ్ ప్రిన్సిపాల్ ని అభినందించడం జరిగినది.

## బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం.



**ఆంధ్ర ప్రగతి పాణ్యం జూన్ 20:** పాణ్యం మండలం ఏపీ మోడల్ స్కూల్ నందు 5 గురు టీచర్స్ బదిలీ పై వెళుతున్న సందర్బంగా వారు గత సంవత్సరాలనుండి ఇప్పటివరకు విద్యార్థులకు మంచి బోధన, క్రమశిక్షణ, తో విద్య బుద్దులు నేర్పించి 10వ తరగతులలో ప్రతి సంవత్సరంప్రయివేట్ స్కూల్ కు ధీటుగా 20 మందికి పైగా 500 మార్కులు వచ్చేలా కృషి చేసినందుకు ఈ రోజు పాఠశాల ప్రిన్సిపాల్, స్కూల్ కళాశాల స్టాఫ్ సిబ్బంది అందరు కలసి బదిలీ పై వెళుతున్న ప్రతి టీచర్స్ కు ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో విద్యార్థులు , బదిలీ పై వెళుతున్న టీచర్లను వెళ్ళ వద్దని కన్నీటితో బాధలు పడుతూ సన్మానం చేసి పంపారు. ఈ కార్యక్రమం లోనూతనము గా వచ్చిన అధ్యాపకులకు స్వాగతం పలుకారు.విద్యార్థి సంఘము నాయకుడు బత్తిని ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## రామతీర్థం పుట్టాలమ్మ దేవస్థానానికి 520 గ్రాముల వెండి నాగ పడిగ విరాళం



**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ, జూన్ 20:** ఆళ్లగడ్డ తాలూకాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థం పుట్టాలమ్మ దేవస్థానానికి అరుదైన, విలువైన విరాళం అందింది. అమెరికాలో నివాసం ఉంటున్న రుద్రవరానికి చెందిన చోళవేటి లక్ష్మీనారాయణ కుమారుడు సురేష్ అనే భక్తుడు, 520 గ్రాముల బరువున్న అపురూపమైన వెండి నాగ పడిగను దేవస్థానానికి విరాళంగా అందజేశారు. ఈ విరాళం దేవస్థానం అభివృద్ధికి, ఆలయ ఆభరణాల సంపదకు మరింత వన్నె తెస్తుంది. భక్తుడు సురేష్ తరపున, వారి కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం దేవస్థానంలో ఈ వెండి నాగ పడిగను ఆలయ అధికారులకు, అర్చకులకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సురేష్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, పుట్టాలమ్మ అమ్మవారి పట్ల తమకున్న అచంచలమైన భక్తి, శ్రద్ధ వల్లే ఈ విరాళం ఇచ్చినట్లు తెలిపారు. అమెరికాలో ఉన్నా మాతృభూమిపై మమకారం అమెరికాలో స్థిరపడినప్పటికీ, మాతృభూమిపై, తమ గ్రామ దేవతపై సురేష్ చూపిస్తున్న మమకారం, భక్తి ప్రశంసనీయం అని ఆలయ కమిటీ సభ్యులు కొనియాడారు. ఇలాంటి విరాళాలు ఆలయ అభివృద్ధికి ఎంతో తోడ్పడతాయని, భక్తులు మరింతగా తమ వంతు సహాయాన్ని అందించాలని వారు కోరారు.

# యోగాంధ్ర కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయండి.

**జిల్లా వ్యాప్తంగా 8.5 లక్షల మంది యోగాంధ్రలో భాగస్వామ్యం. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 20:** ఈనెల 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా నిర్వహించే యోగ ఆంధ్ర కార్యక్రమాలకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి శుక్రవారం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండలాలు, మున్సిపల్ పట్టణ ప్రాంతాలలో 4,644 ప్రదేశాలలో యోగాంధ్ర కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. జిల్లాలో 20 లక్షల మంది జనాభా ఉండగా 8.5 లక్షల మంది వరకు యోగాంధ్ర యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని ప్రతిరోజు యోగాను దినచర్యగా భావించి దైనందిన కార్యక్రమంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. శనివారం నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డులో ఉ.6:45 గం.ల నుండి 8 గంటల వరకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో దాదాపు 5 వేల మంది పాల్గొంటున్నారని ఇందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమీషనర్ ను కలెక్టర్ ఆదేశించారు.



మార్కెట్ యార్డులో ఐదు వేదికలతో పాటు గ్రిడ్స్, పారిశుద్ధ్యం, తాత్కాలిక టాయిలెట్స్, ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. యోగా కార్యక్రమానికి హాజరయ్యే వారికి టీషర్ట్స్, క్యాప్స్ సరఫరా చేయాలని ఈఈ, ఆర్ అండ్ బీ, జిల్లా పర్యాటక అధికారి, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. విశాఖపట్నంలో ప్రధానమంత్రి పాల్గొనే కార్యక్రమాన్ని లైవ్ లింక్ ఇవ్వడం జరుగుతుందని ఇందుకోసం ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనర్ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే సాధకులకు త్రాగునీరు, అల్పాహారం అందించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. యోగా జరిగే ప్రాంతంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓ ఆదేశించారు. గ్రిడ్డుకు 50 మంది చొప్పున 2000 మందికి గ్రిడ్స్ ఏర్పాటు చేసుకునేలా డిఆర్డిఏ పిడిని కలెక్టర్ ఆదేశించారు. 50 మంది ఎన్సిసి, మరో 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను డిప్యూట్ చేయాల్సిందిగా సంబంధిత కమాండెంట్లను ఆదేశించారు. దివ్యాంగులకు ఒక ప్రత్యేక గ్రిడ్ ఏర్పాటు చేయాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ అధికారిని ఆదేశించారు. అదే విధంగా వందమంది సఖి సిబ్బందిని పాల్గొనేలా చూడాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. అలాగే శనివారం ఉదయం జరిగే ఈ యోగా కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, ఎన్జీవోలు, పాత్రికేయులు, పతంజలి, రామచంద్ర మిషన్, యోగా చైతన్యమండలి, ఆయుష్ తదితర విభాగాల యోగ గురువులు, సాధకులు హాజరు కావాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరూ జిల్లా వ్యాప్తంగా జరిగే యోగా కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొనాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# కలెక్టరేట్లో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 20:** నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 7 లక్షల రూపాయలతో నిర్మించిన ఆర్ఓ వాటర్ ప్లాంట్ ను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, భూగర్భ జల శాఖ డిడి రఘురాం, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నిత్యం కలెక్టరేట్ కు వచ్చే అర్జీదారులు, సందర్శకులు, అధికారుల, సిబ్బంది తదితర దాహార్తి అవసరాలను తీర్చేందుకు ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లా పరిషత్ రూ.7 లక్షలు విడుదల చేసిందన్నారు. గంటకు 500 లీటర్ల సరఫరా అయ్యే మినరల్ వాటర్ తో పాటు బోర్ వెల్, పంప్ సెట్టు, షెడ్ తదితర మౌలిక సదుపాయాలతో నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎన్ఎండి ఫిరోజ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:** పేద ప్రజలు ఆపదలో ఉంటే 'నేనున్నాను' అని ఆదుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి మంచి మనసుకు నిదర్శనమని తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. మంత్రి ఫరూక్ గారి క్యాంపు కార్యాలయంలో (రాజ్ టాకీస్) నందు నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులు పసుపుల సాయికుమారి (రూ..51,692) భూమా రామకృష్ణారెడ్డి (రూ .. 67,556) లకు లక్ష 19 వేల రూపాయలు గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఎక్కువ ఆక్సిడెంట్స్ మరియు అనారోగ్య కారణాల వల్ల వచ్చే వారికి ఆరోగ్యం విషయంలో




అజాగ్రత్త వహించకుండా జాగ్రత్తలు వహించాలని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పేద ప్రజలు ఏదైనా ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నా, లేదా ఆరోగ్య పరంగా ప్రాణాల మీదకు వచ్చినప్పుడు అత్యవసరంగా ఆపరేషన్లకు కావల్సిన డబ్బులు లేకపోవడం, ,వారి స్థోమతకు మించి ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు మంత్రి ఫరూక్ కి విన్నవించుకున్న సందర్భంలో వారి ఆవేదన విని, అప్పటికప్పుడు దగ్గరుండి సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయించారన్నారు. అలా పేదవారి ఆపరేషన్ల ఖర్చుకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులు పసుపుల సాయికుమారి (రూ..51,692) , భూమా రామకృష్ణారెడ్డి (రూ .. 67,556) లకు లక్ష 19 వేల రూపాయలు గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రూపంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద కొట్టాల గ్రామ టిడిపి సీనియర్ నాయకులు ప్రేమ్ నాథ్ రెడ్డి , టిడిపి యువ నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి.

**-పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ.**




**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు జూన్ 20:**

ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రవేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని పిడిఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ డిమాండ్ చేశారు.శుక్రవారం నాడు స్థానిక నందికొట్కూరు పట్టణంలోని పటేల్ సర్కిల్ నందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు పట్టణంలో ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి తమ ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఎల్కేజీ నుండి పదవ తరగతి వరకు లక్షలాది రూపాయల ఫీజుల రూపంలో వసూలు చేస్తూ పుస్తకాలు మరియు దుస్తులు అని ప్రత్యేక ఫీజుల రుసుములను వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రధానంగా నందికొట్కూరు పట్టణంలోని విజయ వాణి, సెయింట్ మేరీ ,నవ నంది, శ్లోకా పాఠశాలలు పూర్తిస్థాయిలో ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని అన్నారు. పర్యవేక్షణ చేయాల్సినటువంటి విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం వలన ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు తల్లిదండ్రులను ఫీజుల రూపంలో నిలువు దోపిడీ చేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా స్పెషల్ ఫీజు స్కూల్ డే ,అన్యువల్ డే అంటూ డబ్బే ధ్యేయంగా పాఠశాలలు నడుపుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఆర్టీఈ చట్టాన్ని నందికొట్కూరు పట్టణంలోని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని అన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు జిల్లా ఉపాధ్యక్షులు షాహీద్, జయకర్,విజయ్, తరుణ్, సందీప్, రాజేష్, పి.వై.ఎల్ నాయకులు నవీన్,వినోద్ పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి.. రక్షణ పొందండి.

**-ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి.**



**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 20:** హెల్మెట్ ధరించి ప్రమాదాల బారిన పడకుండా రక్షణ పొందండి అని మహానంది ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మహానంది మండలం గాజులపల్లి గ్రామ పరిధిలోని నంద్యాల -గిద్దలూరు జాతీయ రహదారి బోయలకుంట్ల మెట్ట అర్చి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరైన ధ్రువపత్రాలు,హెల్మెట్ లేని వాహనదారులకు ఫైన్లు విధించడం జరిగిందన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీల్ వాహనదారులు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహానంది పోలీస్ సిబ్బంది, సలాం, మురళి, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ప్రభుత్వ

# ఏడాది పాలనపై రైజ్ సమగ్ర సర్వే

**-ఎంపీల పనితీరుపై 3వ ర్యాంక్ సాధించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

**-మంత్రుల పనితీరుపై 3వ ర్యాంక్ సాధించిన ఎన్ఎండి ఫరూక్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 20:** ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ప్రభుత్వ ఏడాది పాలనపై 'రైజ్ సమగ్ర సర్వే' రెండు రోజుల క్రితం 18-06-2025 న సర్వే ఫలితాలు విడుదల చేసింది. పార్లమెంట్ సభ్యుల పనితీరుకు రైజ్ సర్వే ర్యాంకులు ఇవ్వగా మొదటి స్థానంలో గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రెండవ స్థానంలో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మూడవ స్థానంలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, చివరి స్థానంలో కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు లు నిలిచారు. రాష్ట్ర మంత్రుల పనితీరు ఎలా ఉందన్న ర్యాంకులో మొదటి స్థానంలో కొల్లు రవీందర్, రెండవ స్థానంలో సత్యకుమార్ యాదవ్, మూడవ స్థానంలో ఎన్ ఎం డి ఫరూక్, ఏడవ స్థానంలో బి సి జనార్ధన్ రెడ్డి ఉన్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజా స్పందన, ఏ ప్రభుత్వ పనితీరు బాగుంది, ఎక్కువ సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి, కూటమి ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉంది, ఏ ముఖ్యమంత్రి హయాంలో ఎక్కువ అభివృద్ధి జరిగింది, అమరావతి అభివృద్ధిపై మీ అభిప్రాయం, రాష్ట్ర మంత్రుల పనితీరు ఎలా ఉంది, ప్రభుత్వంపై అసంతృప్తికి తొమ్మిది కారణాలు, ప్రభుత్వానికి అనుకూల అంశాలు ఎనిమిది, ఆంధ్రప్రదేశ్ ఎంపీల పనితీరుకు ర్యాంకులు, గ్రీన్ జోన్ లో ఎమ్మెల్యేలు 32 మంది, ఆరెంజ్ జోన్ లో ఉన్న ఎమ్మెల్యేలు 92 మంది, రెడ్ జోన్ లో ఉన్న ఎమ్మెల్యేలు 53 మంది, 62 శాతం జనసేన ఎమ్మెల్యేలకు ఈ సారి నో ఛాన్స్, 22 శాతం టీడీపీ ఎమ్మెల్యేలకు ఈ సారి అవకాశం ఉండదు అన్న అంశాలపై రైజ్ సమగ్ర సర్వే రిపోర్ట్ విడుదల చేసింది.

## బుక్కాపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం.



**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 20:** మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి బి. నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఈ ఖరీఫ్ సీజన్లో ముందస్తుగా వరి నాట్లు వేసుకోవాలని, తద్వారా రబీలో వేసే వరి మార్చి ఆఖరి లోపల కోత పూర్తి కావడానికి అవకాశం ఉంటుందన్నారు. మార్చి నెలాఖరులోగా రబీ వరి పంట పూర్తి అయ్యేటట్లు రైతులు ప్రణాళిక చేసుకోవాలన్నారు. మార్చి నెలాఖరు లోపల వరి పంట పూర్తి అయితే ఏప్రిల్ మాసంలో సహజంగా వచ్చే అకాల వర్షాలు, గాలుల బెడద నుండి పంటను కాపాడుకోవచ్చని రైతులకు తెలిపారు. అరటి సాగు చేస్తున్న ప్రతి రైతు ఎకరాకు రూ. 2,750 రూపాయలు ప్రీమియం చెల్లించి, పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత భీమా పథకం కింద బీమా చేసుకోవాలన్నారు. జూలై 1వ తేదీ నుండి కామన్ సర్వీస్ సెంటర్ లో ప్రీమియం చెల్లించి, బీమా చేసుకోవచ్చున్నారు. అరటి పంటకు బీమా చేయడానికి ఆఖరి తేదీ జూలై 15 గా నిర్ణయించడం జరిగిందన తెలిపారు. కౌలుకు తీసుకున్న ప్రతి రైతు కౌలు రైతు కార్డులు తీసుకోవాలని, కౌలు కార్డు ప్రయోజనాలు, పంటలో ముడి జింకు ప్రాముఖ్యతను గురించి తెలపడం జరిగిందన్నారు. ప్రతి మూడు సీజన్లకు ఒకసారి ఎకరాకు 20 కిలోల ముడి జింకు వరి పంటలో ఖచ్చితముగ వేసుకోవాలని, ముడి జింకును భాస్వరం ఎరువులతో కలిపి వాడరాదన్నారు. వరిలో పై పాటుగా కాంప్లెక్స్ ఎరువులు వాడరాదని తెలిపారు. వరి పంటలో గంధకము కలిగి ఉన్న ఎరువులను అధికముగా వాడరాదన్నారు. దుక్కిలో భాస్వరం, పొటాష్ ఎరువులు ఖచ్చితముగా వాడాలన్నారు. రైతులకు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే వ్యవసాయంలో ఖర్చు తగ్గించుకోవచ్చునని అన్నారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా జిల్లా కోఆర్డినేటర్ సునీల్ మాట్లాడుతూ.. పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత భీమా పథకంలోని బీమా చేయబడు అంశాలు, బీమా వర్తింపు సమయం గురించి రైతులకు తెలిపారు. బ్యాంకు పాసుబుక్ జిరాక్స్, పొలం పాసుబుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రంతో కామన్ సర్వీస్ సెంటర్ లో గానీ లేదా భీమా కంపెనీ ద్వారా నియమింపబడిన మధ్యవర్తులును సంప్రదించి ప్రీమియం చెల్లించి, అరటి పంటకు బీమా చేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరెడ్డి, ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ సునీల్ , ఫీల్డ్ కోఆర్డినేటర్ శశిధర్, విహెచ్ఏ మౌనిక, రైతులు పాల్గొన్నారు.

# 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని

# కోరుతూ కార్మిక సంఘాల రాస్తారోకో.

**కార్మికుల ను విస్మరిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పతనం ఖాయమని హెచ్చరిక.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:** మే డే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని కోరుతూ సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్టియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నూనెపల్లి- కోవెలకుంట్ల జంక్షన్ లో అరగంట పాటు రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట. మద్దులు, పట్టణ కార్యదర్శి కె. మహమ్మద్ గౌస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురాంమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఐఎఫ్టియు నాయకులు చౌడప్ప, ఆనంద్, రాంబాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి పి వెంకట లింగం, సిఐటియు నాయకులు జైలాన్, ఏఐటియుసి పట్టణ అధ్యక్షుడు భూమని శ్రీనివాసులు వీరితోపాటు కార్మిక సంఘాల నాయకులు కార్యకర్తలు 70 మందికి పైగా పాల్గొనడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ లక్షలాదిమంది కార్మికులు రోడ్లపైకి వచ్చి పోరాటం చేస్తుంటే అక్కడ ఉన్న ప్రభుత్వం పెట్టుబడిదారులకు కార్పొంట సంస్థలకు అనుకూలంగా వ్యవహరించి వేలాది మంది కార్మికులను బలిగొందని ఆ నెత్తుటి మరకలు నుంచి పుట్టిన ఎర్రజెండా నాటి నుండి నేటి వరకు ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని పోరాటం చేయడం జరుగుతుందని బ్రిటిష్ కాలం నాటి నుండి ఉన్న ఎనిమిది గంటల పని విధానాన్ని మోడీ ప్రభుత్వం గత 11 సంవత్సరాల కాలంలో పెట్టుబడిదారులకు కార్పొరేటర్ సంస్థలకు ఊడిగం చేయడం కోసం కార్మికుల పైన కక్షగట్టి ఎనిమిది గంటలకు పైగా 10 12 నుండి 14 గంటల వరకు పనులు చేయాల్సిందే అని నిర్ణయం చేయడం చాలా దుర్మార్గమని కార్మికులను రోబోలుగా చూస్తున్నారు. కానీ కార్మికుల ఆరోగ్య పరిస్థితులను అర్థం చేసుకోవడంలేదని, కేవలం లాభార్జన ధ్యేయంగా పనిచేస్తున్న కార్పొరేటు పెట్టుబడిదారుల సంస్థలకు ప్రభుత్వాలు వత్తాసు పలకడం కార్మికులను నాశనం చేయడం, నయా బానిసలుగా చేయడం కోసమే అని అన్నారు మోడీ ప్రభుత్వం చెప్పిందే తడవుగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ ఆపై 12 నుండి 14 గంటలు పని చేయాలి అని నిర్ణయం కేబినెట్లో తీసుకోవడం సరైంది కాదని వెంటనే కేబినెట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. ఇప్పటికైనా కార్మికుల సంక్షేమం కోసం కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిన ప్రభుత్వమే కార్మికులను రోబోలుగా తయారు చేసే దుర్మార్గమైన విధానాలను మానుకోవాలని లేకుంటే దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

## సిపిఎం పార్టీ పోరాట ఫలితం గా

## కరెంటు, రోడ్డు సమస్య పరిష్కారం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:** భారత కమ్యూనిస్టు పార్టీ( మార్క్సిస్ట్) సిపిఎం పార్టీ పోరాట ఫలితంగా 6వార్డులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ దగ్గర రోడ్డు కరెంటు సమస్య పరిష్కారం అయిందని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు, పుల్లా నరసింహులు తెలిపారు ఈ సందర్భంగా మున్సిపాలిటీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజలు మాట్లాడుతూ మాకు గత సంవత్సర కాలం నుండి కరెంటు సమస్య, రోడ్డు సమస్య వలన చాలా ఇబ్బందులు పడ్డం, కరెంటు సమస్య తీరడం వలన విష పురుగుల వలన ఇబ్బందులు లేకుండా ఉంది. అని అదేవిధంగా వర్షాకాలం వస్తే రోడ్డు సరిగా లేక బురదలోనే తిరిగే వాళ్ళమని ఈ రెండు సమస్యలు సిపిఎం పార్టీ మా కోసం పోరాటం చేసి సమస్యలు పరిష్కరించిందని వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. ఇంకా తాగునీరు సమస్య, ప్రభుత్వ గృహ నిర్మాణ సమస్య ఉందని తొందరలోనే ఆ యొక్క సమస్య పరిష్కారం అవుతాదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, అంజలీ, ఊషా, అంకయ్య, లక్సయ్య, నీలావతి, కొండయ్య, రెడ్డమ్మ, సరోజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ భృతి ఇస్తానని

# యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం.

**-20 లక్షల ఉద్యోగ ఉపాధి కల్పన ఎక్కడ సీఎం గారు.?**

**-ఏడాది పాలనలో యువతకు ఇచ్చిన హామీలపై నోరు ఎత్తని కూటమి ప్రభుత్వం.**

**-ఏఐవైఎఫ్ నగర జిల్లా అధ్యక్షుడు నాగరాముడు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:** నిరుద్యోగ భృతి ఇస్తానని యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక నంద్యాల పట్టణంలో వివిధ కోచింగ్ సెంటర్లలో కరపత్రాలు పంచడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఒక్క నంద్యాల జిల్లా వ్యాప్తంగా లక్ష్యలాది మంది నిరుద్యోగులు ఉన్నారంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ సమస్య ఏ రకంగా ఉందో ప్రభుత్వాలు ఆలోచించాలన్నారు. మన రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నెలకి రూ. 3 వేలు చొప్పన నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిరుద్యోగ యువతకి ఎన్నికల ముందు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదన్నారు. నిరుద్యోగ భృతి వస్తే పోటీ పరీక్షలకు శిక్షణ పొందుదామని నిరుద్యోగ భృతి ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న నిరుద్యోగులను నట్టేట ముంచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 2025 ఫిబ్రవరి నెలలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ద్వారా నిర్వహించిన 'స్కిల్ సెన్సెక్స్ సర్వే' ప్రకారం 26 జిల్లాల్లో 2.67 కోట్ల మంది దగ్గర వివరాలను సేకరించగా ఉపాధి లేని వారి సంఖ్య కోటిన్నర పైనే ఉందన్నారు. రాష్ట్రంలో 18 నుండి 50సం॥ల మధ్య వయస్సు వారిలో ఏ ఉపాధి లేనివారు ఒక కోటి 56 లక్షల మంది ఉన్నారని ప్రభుత్వ గణాంకాలు తెలియ జేస్తున్నాయన్నారు. వీరిలో 52.69 లక్షల మంది ఏదో ఒక పని చేస్తున్నట్లు తెలపగా 52.74 లక్షల మంది ఏ పనైనా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలపడం గమనార్హం గా మారిందన్నారు. నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో నైపుణ్యం కలిగించేలా శిక్షణ ఇచ్చి 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రకటనలే తప్ప సంవత్సర కాలంలో నిరుద్యోగ యువతకు ఒరిగిందేమి లేదన్నారు. ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో సుమారు 3.20 లక్షల ఖాళీలు ఉన్నట్లు లెక్కలు చెబుతున్న ఖాళీ పోస్టులపై శ్వేతపత్రం విడుదలచేసే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం లేదన్నారు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఎప్పుడు భర్తీ చేస్తారో తెలియక కోటి ఆశలతోఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు పోరాడితేనే భవిత అని రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటానికి ఏఐవైఎఫ్ పిలుపు నిస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ లో యువతకి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ. 3 వేలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులు భర్తీ చేసి అమరావతిని ఫ్రిజోన్ గా ప్రకటించి 26 జిల్లాల నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల కోసం నిరుద్యోగ అర్జీ స్వీకరణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, విష్ణు, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు నష్టం కలిగించే

## నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:** నంద్యాల-కార్మికుల హక్కులను హరించివేసి కార్మిక 44 చట్టాలను నాలుగు సివిల్ కోడ్ లను రద్దు చేయాలని 2025 జూలై 9 వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో సమ్మె సంబంధించినటువంటి వాల్ పోస్టులను సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి ఏసురత్నం, ఏ నాగరాజు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి, మద్దులు సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శిలు వి, బాల వెంకట్ లింగం, తిరుపతయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాయక్ ప్రజా సంఘాల జిల్లా నాయకులు పి నరసింహ జై లాన్ లతో కలిసి వాల్ పోస్టర్లు ను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడిదారులకు పారిశ్రామికవేత్తలకు కార్మికులను కట్టు బానిసల్లగా చేయడానికి 44 కార్మిక చట్టాలను నాలుగు సివిల్ కోడ్ ల మార్చి కార్మిక హక్కులను హరించే విధంగా ఉండే విధానాన్ని వెతిరేకిస్తూ దేశవ్యాప్తంగా 11 కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని ఈ దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని, ఈ నాలుగు సివిల్ కోడ్ లు అమలు అయితే ట్రేడ్ యూనియన్ చట్టం 1926, అలాగే పారిశ్రామిక వివాదాల చట్టం 1947, స్టాండింగ్ ఆర్డర్ చట్టం ఈ మూడు చట్టాలు నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని అలాగే కనీస వేతనాలు చట్టం, వేతనాల చెల్లింపు చట్టం, బోనస్ చెల్లింపు చట్టం, సమాన పనికి సమాన వేతనం లాంటి కార్మికులకు గుండెకాయ లాంటి చట్టాలను నిర్వీర్యం చేసే పద్ధతిలో ఈ బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తా ఉందని దీనికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు అందరూ జూలై 9 వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 21 జూన్ 2025



## నంద్యాలలో ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:** నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నంద్యాల తెలుగు మహిళ విభాగం ఆధ్వర్యంలో నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ హాజరై కేక్ కట్ చేసి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల తెలుగుదేశం పార్టీ మహిళ అధ్యక్షురాలు విజయ గౌరీ , కౌన్సిలర్లు జైనాబి , శ్రీదేవి మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అనేక సామాజిక సేవలు అందిస్తూ, వేలాది పేదకుటుంబాల జీవితాలలో వెలుగులునింపుతున్న స్వర్గీయ నందమూరి తారకరామారావు కుమార్తె, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మానేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ వైస్ చైర్ పర్సన్ %ఄ% ఎండి, మహిళలకు మార్గదర్శికురాలు, శ్రీమతి నారా భువనమ్మ కి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు . అలాగే వారు నిండు నూరేళ్లు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు వాళ్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకురాలు పద్మావతి, పావని, నాగరత్నమ్మ , జోష్నా , జనసేన జయంతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

## యోగ వ్యాయామాలు చెయ్యండి..
# ఆరోగ్యాన్ని ఆత్మసౌందర్యాన్ని పెంపొందించుకోండి.

**-సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.-జూన్ 21 న అంతర్జాతీయ యోగ దినోత్సవం.**

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 20:** ప్రస్తుత అధునిక యుగం లో అందరు ఆరోగ్యంగా ఉండాలంటే యోగ వ్యాయామాలు చెయ్యాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. ప్రస్తుత సమాజం లో సామాన్య ప్రజలను జాగృత పరచవలసిన అవసరం ప్రతి ఒక్కరికి ఎంతైన ఉన్నది. యోగభ్యాసం వల్ల మంచి ఆరోగ్యం తో పాటు శారీరక దృఢత్వం, మానశిక శాంతి, అత్మశాంతి లభిస్తుంది. కావున ప్రతి ఒక్కరు తమ దినచర్య లో ఖచ్చితంగా యోగ ,వ్యాయామాలు,ధ్యానం చెయ్యాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. యోగా చెయ్యడం వల్ల తమ ఆరోగ్యాన్ని ఖర్చు లేకుండా కాపాడుకోవచ్చును. నేడు మన నిత్యజీవితం లో మనం పీల్చే గాలి, తినేతిండి, ప్రయాణించే ప్రదేశాలు ,ఉండే పరిసరాలు అన్ని కాలుష్యంతో, కలుషితంతో కూడుకున్నవే. దీని వల్ల వ్యాధుల ప్రాబల్యం ఎక్కువైనది. వీటిని ఎదుర్కోవాలంటే ఖచ్చితంగా యోగా భ్యాసాల వల్లనే సాధ్యమైతుంది. యోగ చెయ్యడం వల్ల శరీరంలో మార్పులు కన్పిస్తాయి. శరీరం తేలిక కావడం మానసికంగా బాధపడేవారికి పూర్తిస్థాయి లో మనోధైర్యంతో మనస్సు ఉత్సాహంగా ఉండటం జరుగుతుందని సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి తెలిపారు. అందువల్ల శరీరానికి శక్తి నిచ్చె యోగాజీవితాన్ని దివ్యజీవణాన్ని అలవర్చుకోవాలని



పి.మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త ,డోన్

సూచించారు. యోగ అనేది మనలో అంతర్లీనంగా ఉండే శక్తిని సమతుల్యమైన పద్ధతిలోమెరుగుపరచుకోవడానికి లేక అభివృద్ధి చేసుకోవడానికి ఉపకరించే ఒక క్రమశిక్షణ వంటిది. కీలకమైన స్వయం అనుభూతిని సాధించుకోవడానికి ఇది ఒక మార్గాన్ని చూపిస్తుంది. యోగా అంటే అంతరాత్మను విశ్వాత్మ తో ఐక్యం చేసే మార్గమని చెప్పవచ్చు. యోగ %-% విశ్వవ్యాప్తంగా ఆచరించే ఒక క్రమశిక్షణ ,సంస్కృతి, జాతీయత, వర్గం, కులం, మతం, విశ్వాసం, లింగబేధం, వయసు మరియు శారీరక స్థితితో నిమిత్తంలేని, సాధన చేయడానికి మరియు అన్వయించుకోవడానికి కూడా యోగ ఒక విశ్వవ్యాప్తంగా యోగ్యత కల సత్ప్రవర్తనతో కూడి వుండే సాధన. రోజువారీ, ఒక క్రమపద్ధతిలో సాధన చేయడం వల్లనే శరీరాన్ని, మనసునూ ఉన్నత స్థితికి చేర్చడానికి ఇది ఒక విధమైన ఒరవడిని సృష్టిస్తుందని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. మనసును శిక్షణ ద్వారా లగ్నం చేస్తూ, అంతరాత్మను పరిశుద్ధం చేయడం ద్వారా ఉన్నత స్థితిలో ఉన్న అంతరాత్మ యొక్క అనుభూతిని పొందడానికి సాధకుడిలో తీవ్రమైన మనోవాంఛ, కోరిక ఉండవలసి ఉంటుంది. యోగా అనేది పురాతన భారతీయ సాంప్రదాయం మరియు మానవాళి అపూర్వమైన నిధి. యోగ అనేది మనస్సు మరియు శరీర ఏకత్వాన్ని ఉద్ఘాటిస్తుంది. ఆరోగ్యం మరియు శ్రేయస్సుకు పవిత్రమైన మార్గం. ఇది వ్యాయామం కాదు. ఇది మిమ్మల్ని మీరు, మనల్ని మనం తెలుసుకోవడానికి సహాయపడే జీవన మార్గమని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

## వంద గొంతులు వంద పాటలతో ఒంగోలుకు పోదాం ...రండీ.

**-రాష్ట్ర అధ్యక్షా కార్యదర్శులు చంద్ర నాయక్, పెంచలయ్య పిలుపు.**

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 20:** సిపిఐ శత వసంతాల సందర్భంగా ఒంగోలు లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 28 వ మహాసభలు కు కళాకారులు వంద గొంతులు వంద పాటలతో తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షా ప్రధాన కార్యదర్శి లు చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్య పిలుపు నిచ్చారు. శుక్రవారం నంద్యాల జిల్లా డోన్ పట్టణం లో ప్రజానాట్యమండలి కళాకారులకు ఆట పాట మాట శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రారంభ సభ వాసు అధ్యక్షత న జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథి లు గా చంద్ర నాయక్ చిన్నం పెంచలయ్య పాల్గొని మాట్లాడుతూ సిపిఐ శత వసంతాల వేడుకలు జరుపుకుంటూ సిపిఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలు నగరంలో జరుగుతున్నాయి అందుకు అవసరమైన కళాకారులను తయారు చేసుకునే క్రమం లో ఊరు వాడల్లో ఉన్న కళాకారులు వేలాది గా తరలి రావాలని పిలుపునిచ్చారు. నేడు దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై నూతన ఆలోచనలతో కొత్త కళారూపాలు




ప్రదర్శించాలని ప్రయత్నిస్తున్నట్లు వారు అన్నారు. దేశాన్ని దోసుకుంటున్న పాలకులకు పాటల తో తగిన బుద్ధి చెప్పాలని వారన్నారు. శాఖ మండల జిల్లా మహాసభలు లో సిపిఐ పోరాటాల విజయాలను కీర్తిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు పాల్గొని ప్రజానాట్యమండలి గొప్పతనాన్ని వివరిస్తూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో తెలంగాణ సాయుధ పోరాటం లో ప్రజానాట్యమండలి పాత్రను వివరిస్తూ గుర్తు చేశారు నైజాం నవాబును తరిమి కొట్టడానికి చదువురాని బండి యాదగిరి పాడిన పాట, నాజర్ బుర్రకథ ప్రజలను ఎంతో ఉత్తేజాన్ని కలిగించి పోరాటాల బాట పట్టించిందన్నారు అలాంటి ప్రజానాట్యమండలి సిపిఐ 100 సంవత్సరాల వేడుకలు సందర్భంగా కొత్త కొత్త పాటలతో నాటికల తో వివిధ రకాల కళారూపాల తో రాష్ట్ర మహాసభలకు సన్నద్ధం కావాలని సూచించారు దేశంలో నిరుద్యోగ పేద ప్రజలపై దాడులు ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెచ్చు మీరి పోతున్నాయని రాజ్యాంగం ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతున్నదని ఆయన పాలకులను తీవ్రంగా విమర్శించారు . రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం కళాకారుల పై కూడా ఉందని ఆ దిశగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ప్రజానాట్యమండలి బాధ్యులు రాధాకృష్ణ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఏ శివయ్య, సిపిఐ మండల కార్యదర్శి నారాయణ పట్టణ కార్యదర్శి మోటా రాముడు కోయలకొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## శాంతినికేతన్ స్కూల్‌లో
## ఘనంగా యోగ ఆంధ్ర కార్యక్రమం



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:** శాంతినికేతన్ స్కూల్ ఆవరణంలో యోగ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి రామకృష్ణ విద్యా సంస్థల అధినేత జి .రామకృష్ణారెడ్డి శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ యోగా కన్వీనర్ నిమ్మకాయల సుధాకర్ పాల్గొనడం జరిగింది. నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం యోగ అని కొనియాడం జరిగింది. అదేవిధంగా యోగ అనేది వయసుకు సంబంధం లేదు యోగ అనేది ప్రతి ఒక్క మనిషికి ఆరోగ్యాన్నిస్తోందని అభిరుచి మధుమాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి భారతీయ జనతా పార్టీ నాయకులు తూము శివారెడ్డి టౌన్ పట్టణ అధ్యక్షుడు. లక్ష్మారెడ్డి రమణ ఎర్రమల బాలముని చింత నాగేశ్వరరావు గుర్రాల చిన్నయ్య తదితర భారతీయ జనతా పార్టీ నాయకులు ఈ యోగా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## యోగాంధ్ర అక్షర క్రమంలో కూర్చున్న విద్యార్థులు

**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ జూన్ 20:** శనివారం జూన్ 21 న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ అపుస్మా ఆళ్లగడ్డ నియోజవర్గం ఆధ్వర్యంలో అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు టి అమీర్ భాష ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ టౌన్ లోని బాలాజీ నగర్ లోని విశ్వశాంతి హై స్కూల్లో కరస్పాండెంట్ సి శ్రీనాథరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు అందరూ యోగేంద్ర అక్షర క్రమంలో కూర్చుని యోగాంధ్రగా స్ఫూర్తిగా అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ స్ఫూర్తిగా నిలిచారు. ఈ కార్యక్రమంలో విక్రమ్, సరళ, సుహాసిని, సుభాన్, షేక్షావలి, ప్రభాకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు టి అమీర్ బాషా మాట్లాడుతూ రేపు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం మన రాష్ట్రంలో యోగాంధ్ర పేరుతో ప్రభుత్వం ఆధ్వర్యంలో యోగా గురించి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. రేపు వైజాగ్ లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రపంచంలోనే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి



ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా మన దేశ ప్రధానమంత్రి మోడీ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న సందర్భంగా విద్యార్థులందరూ యోగాంధ్రగా అక్షర క్రమంలో కూర్చుని శుభాకాంక్షలు తెలపడం జరిగింది యోగ మన దేశ ప్రాచీన కాలం నుండి జరుగుతున్నది యోగా సర్వ రోగ నిరోధ గారిని యోగ చేయటంలా రోగాలన్నీ దూరమవుతాయి యోగాకు దగ్గర అయితే రోగాలకు దూరమైనట్లే యోగ వలన ఆసనాలు వేయడం వలన మానసికంగా శారారికంగా ఆధ్యాత్మికంగా ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది నేటి విద్యా నేటి విద్యార్థులే రేపటి భావి పౌరులు విద్యార్థి దశ నుండే యోగ నేర్చుకోవడం వల్ల ఆరోగ్యంగా జ్ఞానపరంగా మానసికంగా బంగారు భవిష్యత్తుల ఉన్నతశ్రేణిలో రాణించగలరు. రేపు అన్ని పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికారాల అదేశాల మేరకు యోగా దినోత్సవం జయప్రదం చేయవలసిందిగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం తరఫున సవినయంగా కోరుకుంటున్నాను.

## కంచు అఖండ దీప జ్యోతులను
# విరాళంగా ఇచ్చిన దాతలు.

**22 వేల రూపాయలు విలువ చేసే కంచు అఖండ ద్వీప జ్యోతులు బహుకరణ**



**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 20:** కర్ణాటక నివాసి బాహుబలి కడప నివాసి గంగాధర్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి కంచు ద్వీప జ్యోతులను అందజేశారు. ఎలక్ట్రానిక్ మీడియా సీనియర్ రిపోర్టర్ వడ్డే మోహన్ అన్న కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి స్వామివారికి పట్టు వస్త్రాల బహుకరణ

ఆలయ సేవకులు ఏఈ నాగరాజు తెలియజేశారు. శుక్రవారం రోజు అమ్మవారి ఉత్సవ కార్యక్రమంలో పురస్కరించుకొని దేవాలయ ప్రాంగణంలో అల్పాహారా అన్నదాన ప్రసాదం వితరణ జరిగినది. ఈ కార్యక్రమంలో జిందాల్ కంపెనీలో పనిచేసే సీనియర్ ఉద్యోగులు గంగాధర్ రెడ్డి బాహుబలి సంయుక్తముగా అమ్మవారికి కంచు ద్వీప జ్యోతులను అందజేశారు ఉత్సవ కార్యక్రమానికి సీనియర్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ సీనియర్ జర్నలిస్టు వడ్డే మోహన్ అన్న దంపతులు అమ్మవారికి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అన్నదాన ప్రసాద కార్యక్రమం గుమ్మకొండ గ్రామ వాస్తవ్యులు ఏఈ అర్చితా శ్రీరాములు గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద కార్యక్రమం చేపట్టడం జరిగినది 55 రోజులపాటు అఖండ దీప జ్యోతులను వెలిగిస్తూ ఉన్నామని ఏప్రిల్ రెండవ తేదీ వరకు అఖండ జ్యోతిలను వెలిగిస్తామని శ్రీశైలం భ్రమరాంబిక అమ్మవారి ఉపాసకులు ఉదయ నరసింహారాజుల స్వాములవారు ఆదేశాల మేరకు అఖండ దీప జ్యోతులను వెలిగిస్తున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మల్లెంపల్లె నాగేంద్ర కోటకొండ చిన్న మద్దయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు: సిఅర్ పి భవానిపై దాడి చేసిన సిఓ లక్ష్మికుమారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

**- సిఐటియు డిమాండ్. -చర్యలు తీసుకోకపోతే విధులు బహిష్కరిస్తాం.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:** ఆర్పి భవాని పైన దురుసుగా ప్రవర్తించి ఇబ్బందులకు గురిచేసిన, ఆర్ పి షేక్ రహమతు బీ ను 30 వేలు ఇవ్వాలని లేకుంటే విధులనుంచి తొలగిస్తానని బెదిరించిన సి ఓ లక్ష్మి కుమారి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ చైర్ పర్సన్ మాబున్నిసా కి, మెప్మా సీ.ఎం. ఏం. శోభ కి ఏ.పీ. మెప్మా ఆర్పి ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, హైమావతి లతోపాటు ఆర్పీలు ప్రసన్న కుమారి, సులోచన, సత్యవతి, సువర్ణ, మాధవి, జ్యోతి, అరుణ,పుష్పలత, రహమత్ బి,భవాని, అనిత, మహేశ్వరి తో పాటు 80 మంది సిఆర్పిలు పాల్గొనడం జరిగింది. అనంతరం సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్ యూనియన్ అధ్యక్ష,



కార్యదర్శులు సుజాత, హైమావతి లు మాట్లాడుతూ 15వ వార్డులో విధులు నిర్వహిస్తున్న ఆర్పి షేక్ రహమత్ బీ ని సి. ఓ లక్ష్మి కుమారి 30000 రూపాయలు ఇవ్వాలని ఇవ్వకుంటే ఆర్పి గా నిన్ను తొలగిస్తానని, ఎంత పని చేసినా 0% చూపిస్తానని, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో, ఎవరు ఏమి చేయలేరు. నీ శాలరీ కూడా రాకుండా నేను ఆపుతాను అని సి.ఓ లక్ష్మీ కుమారి బెదిరించడం జరిగింది. ఆ తర్వాత ఈ విషయమై ఆర్పి లలో చర్చ జరుగుతుండగా 28వ వార్డులో విధులు నిర్వహిస్తున్న భవాని అందరికీ తెలియజేసిందని మాట్లాడిందని ఆఫీసు దగ్గరికి వచ్చిన సందర్భంలో గొంతు పట్టుకుని మెడకు చున్నిని చుట్టి లాగి చెప్పలేని పదజాలంతో తిడుతూ వెంట్రుకలు పట్టుకుని చెంప మీద కొట్టడం జరిగింది. ఆ తర్వాత చేతివేలు ను విరవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగింది. ఈ ఘటనల వలన ఆర్పీలలో భయం నెలకొంది. కావున ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే వెంటనే సి.ఓ లక్ష్మీకుమారిపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఈనెల 23వ తేదీ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ కి వినతిపత్రం అందజేస్తామని ఆ తర్వాత విధులను బహిష్కరించి నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్నామని ఇప్పటికైనా సి ఓ లక్ష్మి కుమారి పై వెంటనే చర్యలు తీసుకొని సీఆర్పీలలో ఉన్న భయాన్ని పోగొట్టేలా చూడాలని కోరారు.

## ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 20:**
గత నాలుగు రోజుల నుండి తుగ్గలి లోని శ్రీ రామాలయం నందు జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలతో అత్యంత వైభవంగా ముగిశాయి. మూడు రోజులపాటు డాక్టర్ దేవి దయానంద సింగ్ శ్రీమద్రామాయణము మహాభారతం భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, ప్రతిరోజు స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మాన్ని సంరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఎ.కోదండ రాముడు, జి. ఓంకారప్ప, బి. గంగాధర్, బి.ఈశ్వరప్ప బి.కోదండ రాముడు, ఎం. లక్ష్మన్నతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:**
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ యూనియన్ పిలుపుమేరకు కామ్రేడ్ తారకనాథ్ వర్ధంతి సందర్భంగా మరియు స్టేట్ బ్యాంకు 70 సంవత్సరాల వేడుక సందర్భంగా స్థానిక నంద్యాల శ్రీనివాస సెంటర్లోని స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ ఆవరణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని నంద్యాల రీజియన్ రీజినల్ సెక్రటరీ కామ్రేడ్ వెంకటేశ్వర్లు మరియు ఆర్గనైజింగ్ సెక్రటరీ కామ్రేడ్ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రక్తదాన శిబిరాన్ని స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సూర్య ప్రకాష్ , హెచ్ఆర్ మేనేజర్ కేశవ గౌడ్, బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రాఘవ యాదవ్ మరియు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో రెడ్ క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాష, మద్దిలేటి, కోశాధికారి నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ సహదేవుడు, రెడ్క్రాస్ కర్నూల్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, రెడ్ క్రాస్ నంద్యాల కర్నూలు సిబ్బంది పాల్గొనగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు అధికారులు కష్టమర్లు దాదాపు 71 మందికి పైగా



రక్తదానం చేయగా, ఇందులో 18 రక్తం యూనిట్లు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ సూర్య ప్రకాష్ గారు మాట్లాడుతూ స్టేట్ బ్యాంకు 70 సంవత్సరాల వేడుక సందర్భంగా దేశవ్యాప్తంగా 70 వేల యూనిట్ల సేకరణ లక్ష్యంగా స్టేట్ బ్యాంకు రెడ్ క్రాస్ సంయుక్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ఈరోజు స్టేట్ బ్యాంక్ అధికారులు మరియు అమరావతి రీజనల్ స్టాఫ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ నంద్యాల రీజనల్ సెక్రటరీ కామ్రేడ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కామ్రేడ్ తారకనాథ్ వర్ధంతి సందర్భంగా ఈరోజు స్టేట్ బ్యాంకు సంబంధించిన ఉద్యోగులు కూడా



రక్తదాన శిబిరంలో పాల్గొన్నారనీ తెలిపారు. రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల మాట్లాడుతూ స్టేట్ బ్యాంకు వారు ఉద్యోగులు అధికారులు కలిసి రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం చాలా సంతోషదగ్గ విషయమని రక్తదానం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఏ శిబిరం నుండి నంద్యాల జిల్లాలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తాన శిబిరాల నుండి నంద్యాల ప్రభుత్వాసుపత్రికి 30 శాతం రక్తం యూనిట్లు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా రెడ్ క్రాస్ లో రిజిస్టర్ చేసుకున్న తలస్మియా బాధితులకు రక్తం ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలందించి జిల్లాకు మంచి పేరు తీసుకరండి.

**-కలెక్టరేట్ లో ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**
















**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 20:**
ప్రజలకు మెరుగైన సేవలు అందించి జిల్లాకు రెవెన్యూ పరంగా మంచి పేరు తెచ్చేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో రెవెన్యూ దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఏపిఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు కామేశ్వర రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందజేసి ప్రజల మన్ననలను పొందేలా రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలన్నారు. 1786వ సం. జూన్ 20వ తేదీన రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని, దానికి ప్రతిగా ప్రతి సంవత్సరం జూన్ 20వ తేదీన రెవెన్యూ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. మౌర్యుల కాలంలో కౌటిల్యుడు రెవెన్యూ హోదాలు ఏర్పాటు చేయడానికి కృషి చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ ఉన్న లోపాలను సరిచేస్తూ ముందుకు వెళ్లగలిగితే రెవెన్యూ సమస్యలు పరిష్కారం చేసే దిశగా కృషి చేయాలన్నారు. రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఉద్యోగి పదవికి వన్నె తెచ్చేలా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు పూర్తి స్థాయిలో అందేలా చూడాలన్నారు. రెవెన్యూ యంత్రాంగం మీద ఉన్న నమ్మకంతో ప్రజలు మన దగ్గరికి వస్తారని వారితో సహృదయంతో మెలగాలన్నారు. అంతేకాకుండా మిగతా శాఖలను కూడా సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లడం ద్వారా జిల్లా ముందంజలో ఉంటుందన్నారు. ఏ రోజూ పని ఆ రోజూ పని పూర్తి చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. జిల్లాలో రెవెన్యూ సంబంధించి ట్రైనింగ్ సెంటర్స్ ఏర్పాటు చేయమని తహశీల్దార్లు కోరడం జరిగిందని అందుకు విడతల వారీగా శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కలెక్టర్ గా రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన సమయంలో సహాయ సహకారాలు అందజేసిన అధికారులను కలెక్టర్ గుర్తు చేసుకుని వారికి కృతజ్ఞతలు తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖపై ప్రజలకు ఎంతో గుర్తింపు ఉందని అందుకు నాణ్యతతో ప్రజలకు సేవలు అందజేయాలన్నారు. ఏదైనా సమస్య మీ దృష్టికి వచ్చినపుడు వాటిని పరిష్కరించాలనే కోణంలో కాకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా కృషి చేయాలనన్నారు. తహశీల్దార్లకు ఉన్న ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ పవర్స్ ను ఉపయోగించి ప్రజలకు మేలు చేయాలని తెలిపారు. అదే విధంగా రెవెన్యూ శాఖలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తహశీల్దార్లు రెవెన్యూ శాఖలో వారి అనుభవాలను పంచుకున్నారు. ముఖ్యంగా డోన్ ఆర్డీఓ కార్యాలయ ఎడిఎం అంజన్ బాబు చేసిన మిమిక్రీ, పేరడీలు అందరినీ ఉత్సాహ పరిచగా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.
అనంతరం రెవెన్యూ శాఖలో విశిష్ట సేవలు అందించిన సిబ్బందిని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శాలువతో సత్కరించారు. అదే విధంగా పదవీ విరమణ పొందిన రెవెన్యూ సిబ్బందిని కూడా జిల్లా

కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శాలువతో సత్కరించారు. అనంతరం రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్కు మెమెంటోను అందజేసి కృతజ్ఞత తెలుపుకున్నారు.



## తాళ్లపాక అన్నమాచార్యుల కుటుంబీకులు నంద్యాల కు రావడం అదృష్టం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:**
కలియుగ వైకుంఠ తిరుమల క్షేత్రంలో అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య సన్నిధిలో నిత్యం అన్నమయ్య సంకీర్తన కైంకర్యా పరులు. శ్రీమన్ శ్రీ శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు వారి 12వ తరము వారసులు శ్రీ శ్రీ తాళ్లపాక



స్వామీజీ వారు ఆచార్య పురుష గురువర్యులు శ్రేష్ట శుద్ధి దశమి శుక్రవారం నాడు చంద్రిక రవికుమార్ దంపతులు ఆహ్వానం మేరకు రోజా కుంట లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కమిటీ హాల్ లో జరిగినటువంటి శ్రీ తాళ్లపాక స్వామి వారిచే సంకీర్తన మృతం లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. అభిరుచి మధు మాట్లాడుతూ శ్రీ మన శ్రీ శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు కుటుంబీకులు మన నంద్యాలకు రావడం ఈరోజు మంచి శుభదినము అని కొనియాడం జరిగింది. స్వామివారిని నంద్యాలకు తీసుకురావడంలో చంద్రిక రవికుమార్ కుటుంబీకులకు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ గోస్పాడు మండలం నాయకులు బెక్కం నాగేశ్వర్ రెడ్డి గారు. బెక్కం రామచంద్రారెడ్డి కిరణ్ మబుల్. ఎర్రమల బాలముని వంశీ తదితరులు ఈ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# యోగాతో యోగ్యత వస్తుంది

**ఎల్బీ స్టేడియం యోగాలో వెంకయ్యనాయుడు -కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు**





**హైదరాబాద్,జూన్20 ఆంధ్ర ప్రగతి**
యోగా చేస్తే యోగ్యులు అవుతారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తెలిపారు. ఎల్బి స్టేడియంలో జరిగిన యోగా కౌంట్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా వెంకయ్యనాయుడు మాట్లాడారు. మానసిక శక్తులను ఏకం చేసేది యోగా అని ప్రశంసించారు. విశ్వమంతా పరిపూర్ణ ఆరోగ్యంతో, శాంతితో ముందుకు సాగాలన్నదే యోగ దినోత్సవ సంకల్పమని స్పష్టం చేశారు. యోగాకు మతం లేదు జాతి లేదని, యోగా మన జీవన విధానమని తెలియజేశారు. ప్రపంచంలోనే అద్భుత సాహసం ఆపరేషన్ సింధూర్ అని కొనియాడారు. ఒకే భూమి? ఒకటే ఆరోగ్యం కోసం యోగ అని అనే సంకల్పంతో ఈ ఏడాది యోగ దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందని, మనమంతా ఇదే సంకల్పాన్ని తీసుకుని వసుధైవ కుటుంబ భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది యోగ మార్గాన్ని సాధన చేస్తూ ముందుకు సాగుతున్నారని, విదేశీయులంతా యోగ మార్గాన్ని తలకెత్తుకుని ముందుకు సాగుతుంటే, ఈ నేల మీద పుట్టిన మనం యోగ మార్గానికి ఇంకెంత గౌరవం ఇవ్వాలో ఒక్కసారి ఆలోచించుకోవాలని, యోగ మార్గాన్ని అనుసరించవలసిందిగా వెంకయ్యనాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్వర్మ, వెంకయ్యనాయుడు..కిషన్‌రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, సినీనటులు కుష్బూ, మీనాక్షి చౌదరి హాజరయ్యారు.

# ఆరంభం అదిరింది

**యశస్వీ జైస్వాల్ సెంచరీ**
**రిషభ్ పంత్ హాఫ్ సెంచరీ**
**ఇంగ్లండ్‌తో తొలి టెస్టు**
**కెప్టెన్ గిల్ అజేయ శతకం**
**భారత్ మొదటి ఇన్నింగ్స్ 359/3**





లీడ్స్: ఇంతకాలం జట్టుకు ప్రధాన ఆకర్షణగా ఉన్న స్టార్ బ్యాటర్లు లేరు.. పైగా కొత్త కెప్టెన్.. దీనికి తోడు అంతగా అనుభవం లేని జట్టు కావడంతో తేలిపోవడం ఖాయమే.. సిరీస్ ఆరంభానికి ముందు భారత టెస్టు జట్టుపై విశ్లేషకుల అంచనా ఇది. కానీ శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని యువ జట్టు మొదటి రోజే పట్టు వదలని ఆటతీరుతో వహ్వా అనిపించింది. తద్వారా ఇంగ్లండ్ గడ్డపై ఐదు టెస్టుల సిరీసను ఘనంగా ఆరంభించింది. బలహీనంగా భావించిన బ్యాటర్లే భారీ భాగస్వామ్యాలతో ప్రత్యర్థి బౌలర్లను చెండాడారు. కెప్టెన్‌గా గిల్ (175 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్‌తో 127 బ్యాటింగ్) తన ప్రస్థానాన్ని శతకంతో ఘనంగా మొదలెట్టాడు. అలాగే ఇక్కడ తొలి టెస్టు ఆడుతున్న ఓపెనర్ యశస్వీ జైస్వాల్ సైతం (159 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్‌తో 101) మూడంకెల స్కోరుతో ఆకట్టుకున్నాడు. ఫలితంగా శుక్రవారం ఆరంభమైన ఈ తొలి టెస్టులో భారత్ ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 3 వికెట్లకు 359 పరుగులు చేసింది. క్రీజులో గిల్‌కు జతగా పంత్ (65 బ్యాటింగ్) ఉన్నాడు. రాహుల్ (42) ఫర్వాలేదనిపించాడు. స్టోక్స్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఈ మ్యాచ్‌లో సాయి సుదర్శన్ అరంగేట్రం చేయగా, 8ఏళ్ల తర్వాత కరుణ్ నాయర్ టెస్టుల్లోకి రీఎంట్రీ ఇచ్చాడు.

%ూదీచీ% ఛానల్ ఫాలో అవ్వండి

ఓపెనర్ల అండగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనింగ్ జోడీ జైస్వాల్, రాహుల్ నిలకడైన బ్యాటింగ్‌తో శుభారంభం అందించింది. విదేశీ గడ్డపై ఆరంభంలోనే వికెట్ కోల్పోయే అలవాటున్న భారత్ ఈసారి ఎదురొడ్డి నిలిచింది. ఏకంగా 25 ఓవర్లపాటు క్రీజులో నిలిచి తొలి వికెట్‌కు 91 పరుగులు జత చేశారు. అటు బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ నిర్ణయాన్ని దెబ్బతీస్తూ ఈ ఇద్దరూ ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ సాగించారు. బంతి అప్పుడప్పుడూ స్వింగ్ అయినప్పటికీ ఓపికను కనబర్చారు. అటు చక్కటి ఎండ కాయడంతో పిచ్ ఫ్లాట్‌గా మారింది. దీంతో అవకాశం చిక్కినప్పుడల్లా ఇద్దరూ కలిసి 16 ఫోర్లు రాబట్టారు. ఇలాంటి పిచ్‌లపై చక్కటి లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టడి చేసే పేసర్లు అండర్సన్, బ్రాడ్ లేని లోటు ఇంగ్లండ్ బౌలింగ్‌లో స్పష్టంగా కనిపించింది. ఈ టెస్టుకు ముందు ఇండియా 'ఎ' తరఫున ఆడిన జైస్వాల్ పదేపదే ఆఫ్‌స్టంపనకు ఆవల వెళ్లే బంతులకు అవుటై నిరాశపర్చాడు. కానీ ఈసారి లోపాన్ని అధిగమించి నిలబడ్డాడు. అటు రాహుల్ చక్కటి కవర్ డ్రైవ్స్‌తో క్లాస్ బ్యాటింగ్‌ను కనబర్చాడు. అయితే అంతా సజావుగా సాగుతున్న వేళ లంచ్ బ్రేక్‌కు ముందు ఝులక్ తగిలింది. చక్కగా కుదురుకున్న రాహుల్‌ను అవుట్ స్వింగర్‌తో కార్స్ అవుట్ చేశాడు. ఇక తర్వాతి ఓవర్‌లోనే అరంగేట్ర బ్యాటర్ సుదర్శన్‌ను స్టోక్స్ డకౌట్ చేయడంతో 92/2 స్కోరుతో జట్టు లంచ్‌కు వెళ్లింది. శతక భాగస్వామ్యం: బ్రేక్‌కు ముందే టపటపా రెండు వికెట్లు తీసిన ఆనందంలో ఉన్న ఇంగ్లండ్‌ను జైస్వాల్, గిల్ విసిగించారు. రెండో సెషన్ ఆద్యంతం వికెట్ కోల్పోకుండా ఆడిన ఈ యువ ఆటగాళ్లు 123 పరుగులు అందించారు. ఈ క్రమంలో జైస్వాల్ ఇంగ్లండ్ గడ్డపై తొలి శతకం సాధించగా.. అటు గిల్ సైతం హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అటు స్కోరు సైతం 200 దాటడం విశేషం. గిల్ ఆరంభంలో వేగం కనబరుస్తూ వోక్స్ ఓవర్‌లో మూడు ఫోర్లు బాదాడు. కాసేపటికే జైస్వాల్ సైతం వోక్స్ ఓవర్‌లోనే మరో మూడు ఫోర్లు రాబట్టాడు. అలాగే చక్కటి ఫోర్‌తో గిల్ 56 బంతుల్లోనే టెస్టుల్లో తన వేగవంతమైన హాఫ్‌సెంచరీ పూర్తి చేశాడు. విరామానికి కాస్త ముందు జైస్వాల్ సెంచరీ పూర్తి చేశాడు. అయితే టీ బ్రేక్‌కు ముందు ఓవర్‌లో స్టోక్స్ ఏడు బంతులు వేయడం గమనార్హం.

గిల్, పంత్ జాగ్రత్తగా..: ఆఖరి సెషన్ ఆరంభంలోనే జైస్వాల్‌ను స్టోక్స్ బౌల్డ్ చేశాడు. దీంతో మూడో వికెట్‌కు 129 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. అయితే ఆ తర్వాత కూడా ఇంగ్లండ్‌కు ఏమీ కలిసి రాలేదు. గిల్‌కు పంత్ జత కలవడంతో భారత్‌కు మరో శతక భాగస్వామ్యం అందింది. ఇద్దరూ ఎలాంటి రిస్కీ షాట్లకు వెళ్లకుండా వికెట్ కాపాడుకున్నారు. ముఖ్యంగా పంత్ తన సహజశైలిని పక్కనబెట్టి డిఫెన్స్‌కు ప్రాధాన్యమిచ్చాడు. అటు జోరు మీదున్న గిల్.. టంగ్ ఓవర్‌లో ఫోర్‌తో శతకం పూర్తి చేసుకున్నాడు. పంత్ సైతం స్లాగ్ స్వీప్‌తో ఫోర్ బాది హాఫ్ సెంచరీ అందుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరూ నాలుగో వికెట్‌కు అజేయంగా 138 పరుగులు అందించి తొలి రోజు ఆటను ముగించారు.

లీడ్స్‌లో తొలి వికెట్ (91)కు అత్యధిక భాగస్వామ్యం అందించిన భారత జోడీగా యశస్వీ-రాహుల్. గవాస్కర్- శ్రీకాంత్ (1984లో 64) రికార్డును అధిగమించారు.

విదేశీ గడ్డపై తొలి టెస్టు తొలి రోజే ఇద్దరు భారత బ్యాటర్లు (గిల్-జైస్వాల్) శతకాలు సాధించడం ఇది మూడోసారి. గతంలో సచిన్-సెహ్వాగ్, ధవన్-పుజార ఉన్నారు.

భారత టెస్టు కెప్టెన్సీ అరంగేట్రంలోనే శతకం బాదిన నాలుగో బ్యాటర్‌గా గిల్. గతంలో విజయ్ హజారే (164 నాటౌట్), గవాస్కర్ (116), విరాట్ (115) ఉన్నారు.

కెరీర్ తొలి టెస్టులోనే డకౌట్ అయిన పదో భారత బ్యాటర్‌గా సాయి సుదర్శన్



## సీజన్ తొలి టైటిల్‌పై నీరజ్ గురి

**నేడు పారిస్ డైమండ్ లీగ్**

**అర్ధరాత్రి 1.10 నుంచి**



పారిస్: ఇటీవలే 90 మీటర్ల మార్క్‌ను అందుకున్న భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఇప్పుడికసీజన్ తొలి టైటిల్‌పై దృష్టి సారించాడు. ఈక్రమంలో శుక్రవారం జరిగే పారిస్ డైమండ్ లీగ్‌లో విజేతగా నిలవాలని పట్టుదలగా ఉన్నాడు. కానీ జర్మనీ దిగ్గజం జులియన్ వెబర్, రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) నుంచి చోప్రాకు తీవ్ర పోటీ ఎదురు కానుంది. పారిస్ డైమండ్ లీగ్ బరిలో దిగుతున్న ఏడుగురు త్రోయర్లలో ఐదుగురు 90 మీ. మార్క్‌ను చేరుకున్న వారే కావడం గమనార్హం. ఈ లీగ్ 'వాండా డైమండ్ లీగ్' యూ ట్యూబ్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారమవుతుంది.



## షణ్ముఖి, గణేశ్‌లకు రజతాలు



సింగపూర్: ఆసియా కప్ లెగ్ 2 పోటీల్లో భారత యువ ఆర్చర్లు ఏడు విభాగాల్లో ఫైనల్స్ చేరినా.. రెండింటిలోనే విజయం సాధించగలిగారు. శుక్రవారం ఇక్కడ ముగిసిన అండర్-21 టోర్నీలో భారత ఆర్చర్లు మొత్తంగా రెండు స్వర్ణాలు, ఆరు రజతాలు, ఓ కాంస్యంతో కలిపి తొమ్మిది తొమ్మిది పతకాలు కొల్లగొట్టారు. మూడు విభాగాల్లో స్వర్ణ పోరులో నిలిచిన తెలుగమ్మాయి షణ్ముఖి నాగసాయి బుద్దె మూడింటిలోనూ రజతాలకే పరిమితమవగా.. మరో తెలుగు కుర్రాడు గణేశ్ మణిరత్నం తిరుమూరు కూడా రజతంతో సరిపెట్టుకున్నాడు. వ్యక్తిగత మహిళల కాంపౌండ్ విభాగం ఫైనల్లో భారత్‌కే చెందిన తేజల్ సాల్వే 146-144తో షణ్ముఖిని ఓడించి పసిడి పట్టేసింది. ఇక మిక్స్‌డ్ కాంపౌండ్ ఈవెంట్ తుదిపోరులో షణ్ముఖి/కుశాల్ దలాల్ ద్వయం 153-155తో కజకిస్థాన్ జోడీ చేతిలో ఓటమిపాలైంది. మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో షణ్ముఖి/తేజల్/తనిష్కలతో కూడిన జట్టు షూటాఫ్‌లో ఓటమిపాలై రజతంతో సంతృప్తి పడింది. ఇక, పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత కేటగిరి ఫైనల్లో కుశాల్ 149-143తో జోషువా (ఆస్ట్రేలియా)ను ఓడించి స్వర్ణం నెగ్గగా, ఇదే ఈవెంట్‌లో సచిన్ 148-146తో హిన్నే బచ్చుర్ (బంగ్లాదేశ్)పై నెగ్గి కాంస్యం అందుకున్నాడు. కాంపౌండ్ పురుషుల టీమ్ ఈవెంట్ స్వర్ణ పోరులో గణేశ్ తిరుమూరు/కుశాల్/మిహిర్‌లతో కూడిన జట్టు 231-235తో కజకిస్థాన్ చేతిలో ఓడి రజత పతకంతో సరిపెట్టుకుంది. ఇక, రికర్వ్ పురుషుల టీమ్ విభాగంలో విష్ణు చౌదరి/పరాస/జుయెల్‌లతో కూడిన త్రయం స్వర్ణం చేజార్చుకుంది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో విష్ణు/వైష్ణవి 0-6తో ఇండోనేసియా జంట చేతిలో ఓటమిపాలై రజతం అందుకుంది.

## నల్లటి బ్యాండ్లతో బరిలోకి దిగిన టీమిండియా క్రికెటర్లు



భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభమైంది. ఇరు జట్ల మధ్య శుక్రవారం (జూన్ 20)న ప్రారంభమైన మొదటి టెస్టులో టాస్ గెలిచిన ఇంగ్లాండ్, భారత్‌ను ముందుగా బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తొలి మ్యాచ్ లీడ్స్‌లోని చారిత్రాత్మక హెడింగ్లీ మైదానంలో జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో యంగ్ ప్లేయర్ సుదర్శన్ తన టెస్ట్ క్రికెట్‌లోకి అడుగుపెట్టగా, మరో సీనియర్ ప్లేయర్ కరుణ్ నాయర్ కూడా 8 సంవత్సరాల తర్వాత ప్లేయింగ్ ఎలెవన్‌లోకి వచ్చాడు. అయితే ఈ టెస్ట్ మ్యాచ్‌లో, రెండు జట్ల ఆటగాళ్లు నల్లటి చేతి బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి నివాళులు అర్పించడానికి రెండు జట్ల ఆటగాళ్లు నల్లటి బ్యాండ్‌లు ధరించారు. జాతీయ గీతానికి ముందు రెండు జట్లు రెండు నిమిషాల మౌనం పాటించాయి. జూన్ 12న, అహ్మదాబాద్ నుండి లండన్‌కు వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం %ూ×%171 టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. ఈ ప్రమాదంలో 270 మందికి పైగా మరణించారు. జూన్ 12న మధ్యాహ్నం 1:38 గంటలకు ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. ఈ విమానంలో 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. ప్రయాణీకులలో 169 మంది భారతీయులు, బ్రిటన్, పోర్చుగల్ మరియు కెనడా పౌరులు ఉన్నారు. గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీతో సహా మొత్తం 270 మందికి పైగా ఈ ఘోర ప్రమాదంలో మరణించారు. దీనికి సంతాప సూచకంగానే ఇరు జట్ల ఆటగాళ్లు నల్లటి బ్యాండ్లు ధరించి మైదానంలోకి దిగారు.

## భారీగా పెరిగిన వింబుల్డన్ ప్రైజ్‌మనీ



ప్రతిష్ఠాత్మకమైన వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో సింగిల్స్ టైటిల్స్ సాధించే ఆటగాడికి భారీ నగదు నజరానా లభించనుంది. 2025లో జరిగే వింబుల్డన్ టోర్నీ కోసం రూ. 624 కోట్ల నగదు బహుమతిని అందించాలని ఆల్ ఇంగ్లండ్ క్లబ్ అధికారులు నిర్ణయించారు. గత సీజన్‌తో పోలిస్తే ఈ మొత్తం ఏడు శాతంఅధికం కావడం విశేషం. విజేతగా నిలిచే ఆటగాడికి రూ. 34 కోట్ల నగదు బహుమతిని అందజేస్తారు. 2024తో పోలిస్తే ఇది 11.1 శాతం అధికం కావడం గమనార్హం. కాగా, వింబుల్డన్ టోర్నీలో పురుషులు, మహిళల విజేతలకు సమాన బహుమతి ఇవ్వడం అనవాయితీగా వస్తోంది. ఇక తొలి రౌండ్‌లో నిష్క్రమించే ఆటగాళ్లకు రూ. 76 లక్షల ప్రైజ్‌హనీ లభిస్తోంది. కాగా, గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లలో వింబుల్డన్ ప్రత్యేక స్థానం ఉన్న సంగతి తెలిసిందే. ఈ టోర్నమెంట్‌లో టైటిల్ సాధించడాన్ని ఆటగాళ్లు చాలా గర్వంగా భావిస్తారు. కాగా, వింబుల్డన్ 2025 సీజన్‌కు ఈ నెల 30న తెరలేవనుంది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# టైగర్ పేరు.. క్లీన్ కారా



: మెగా ఫ్యామిలీలో ఇప్పుడు ఫుల్ ఫ్యామిలీతో ఆడుకోగలిగే వయసు వచ్చింది క్లీన్ కారాకు. రామ్ చరణ్, ఉపాసన దంపతులు తల్లిదండ్రులయ్యి సంవత్సరం దాటుతోంది. తన కూతురు క్లీన్ కారా జన్మదినాన్ని ప్రత్యేకంగా సెలబ్రేట్ చేస్తూ ఉపాసన చేసిన తాజా పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో ముద్దుగా కనిపిస్తున్న టైగర్ కబ్, ఉపాసన చేతిలో క్లీన్ కారా ఉన్న ఫోటోలు అభిమానుల మనసులను గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా ఉపాసన తన పోస్టులో, “సరిగ్గా సంవత్సరం క్రితం, ఈ టైగర్ కబ్ పుట్టింది. ఇప్పుడు అది ఎంతో చురుకైన టైగ్రెస్‌గా మారింది. ఇది ఇప్పుడు మా క్లీన్ కారాతో తన పేరును పంచుకుంటోంది. ఈ ప్రత్యేక గిఫ్ట్‌కి హైదరాబాద్ జూ సూపర్ కృతజ్ఞతలు” అంటూ పేర్కొన్నారు. ఫోటోలలో ఒక దానిలో పసివాడిగా టైగర్ కబ్, మరొకదిలో పెద్దగా పెరిగిన టైగ్రెస్‌ను ఆమె కూతురితో కలిసి చూసిన మూమెంట్ ఉంది. ఈ ఫోటోలు ద్వారా వారు తీసుకున్న కేర్ డెడికేషన్ స్పష్టంగా కనిపిస్తుంది. టైగ్రెస్‌కు క్లీన్ కారా పేరు పెట్టడమే కాదు, “వన్యప్రాణులు అడవిలోనే ఉండాలి, అయితే అతి పెద్ద గౌరవంతో వాటిని సంరక్షించే ప్రయత్నాలను మేము మద్దతు ఇస్తాం” అంటూ ఉపాసన భావోద్వేగంగా వెల్లడించారు. క్లీన్ కారా బర్త్‌డే సందర్భంగా ఇలా ఒక టైగ్రెస్‌కు తన పేరును పెట్టడం మెగా ఫ్యామిలీని ప్రేమించే ప్రతి ఒక్కరినీ హత్తుకుంది. ఈ పోస్ట్‌లో ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ కూడా స్పందిస్తూ, “అత్యంత మధురం. మీ ముద్దుల లిటిల్ కబ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు” అంటూ కామెంట్ చేశారు. ఇదే సమయంలో ఎంతో మంది సెలబ్రిటీలు, ఫ్యాన్స్ కూడా తమ శుభాకాంక్షలను తెలియజేశారు. ఇలా రామ్ చరణ్ - ఉపాసన కూతురి బర్డ్‌డే సెలెబ్రేషన్ సోషల్ మీడియాలో హడావిడిగా మారింది. ఇక రామ్ చరణ్ గతంలో ఓ ఇంటర్వ్యూలో “నన్ను క్లీన్ కారా నాన్న అని పిలిచే రోజే, అందరికీ ఆమెను పరిచయం చేస్తాను” అని చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పటికీ వారు తమ కూతురి ముఖాన్ని పూర్తిగా రివీల్ చేయకపోయినా, ఈ పిక్స్ మాత్రం భావోద్వేగాలను వ్యక్తపరచేలా ఉన్నాయి. ఇక మెగా డాటర్ దర్శనం ఎన్నటికీ జరుగుతుందో చూడాలి.

# డ్రాగన్ లో టాలీవుడ్ నేచురల్ బ్యూటీ!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో పాన్ ఇండియాలో %-%డ్రాగన్%-% తెరకె క్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో తారక్ కి జోడీగా రుక్మిణీ వసంత్ నటిస్తోంది. సౌత్ భామల్ని హీరో యిన్లగా ఎంపిక చేయడం అన్నది ప్రశాంత్ నీల్ కి సెంటిమెంట్. %-%కేజీఎఫ్%-% లో శ్రీనిధి శెట్టి అలాగే ఛాన్స్ అందుకుంది. అటుపై తీసిన సలార్%లోనూ శ్రుతి హాసన్ కి అలాగే అవకాశం వచ్చింది.డ్రాగన్%-% సెట్స్ లో ఉన్న సమయంలో రుక్మిణీ వసంత్ కి తెలుగు ఆఫర్లు వెల్లువలా వచ్చి పడుతున్నాయి. నిర్మాతలు అడ్వాన్స్ లు చెల్లించడానికి రెడీగా ఉన్నారు. ఇంకా ఈ సినిమాలో చాలా బలమైన పాత్రలు కనిపించనున్నాయి. ఇదే చిత్రంలో తెలుగు నటి ఆనంది కి కూడా ఛాన్స్ వచ్చిందిట. అమ్మడిని ఓ కీలక పాత్రకు ఎంపిక చేసినట్లు సమాచారం. ఫ్లాష్ బ్యాక్ లో వచ్చే కొన్ని సన్నివేశాల్లో ఆనంది పాత్ర కీలకంగా ఉంటుందని అంటున్నారు.ఇదే నిజమైతే ఆనంది కెరీర్ టర్నింగ్ తీసుకున్నట్లే . ఇప్పటికే తెలుగు, తమిళ్ లో చాలా సినిమాలు చేసింది. కానీ స్టార్ హీరోల చిత్రాల్లో అవకాశాలకు మాత్రం దూరంగానే ఉంది. ట్యాలెంటెడ్ బ్యూటీ అయిన సరైన అవకాశాలు రాకపోవడంతో పెద్దగా వెలుగులో కి రాలేకపోయింది. కానీ డ్రాగన్ అవకాశం గనుక నిజమైతే ఆనంది కెరీర్ కొత్త టర్నింగ్ తీసుకుంటుంది. సక్సస్ అయితే పాన్ ఇండియాలో గుర్తింపు దక్కుతుంది.ఇటీవలే రిలీజ్ అయిన %-%భైరవం%-%లో ఆనంది నటించిన సంగతి తెలిసిందే. కానీ ఆ సినిమా అంచనాలు అందుకోలేదు. ప్రస్తుతానికి తమిళ్ అవకాశాలు కూడా చేతిలో లేవు. ఈ నేపథ్యంలో %-%డ్రాగన్%-% ఛాన్స్ అమ్మ డికి బిగ్ రిలీఫ్ అనొచ్చు. ఆనంది కెరీర్ ప్రారంభించి ఇప్పటికే దశాబ్ధం దాటిన సంగతి తెలిసిందే.

# ఇద్దరు భామలతో శర్వానంద్ రొమాన్స్



యంగ్ హీరో శర్వానంద్ సక్సెస్ కోసం పోరాటం చేస్తున్నాడు. కొంత కాలంగా శర్వాకి విజయాలు చెంత చేర కపోవడంతో కసిగా పని చేస్తున్నాడు. ఒకేసారి రెండు..మూడు సినిమాలు సెట్స్ లో పెట్టాడు. ప్రస్తుతం శర్వానంద్ హీరోగా నటిస్తోన్న 35, 36, 37 చిత్రాలు ఆన్ సెట్స్ లో ఉన్నాయి. 35వ చిత్రం %-%నారీ నారీ నడుమ మురారీ%-%. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఇదొక ట్రయాంగిల్ లవ్ స్టోరీ.వినోదానికి పెద్ద పీట వేసారు. శర్వానంద్ పాత్ర గత చిత్రాలకు భిన్నంగా ఉంటుంది. ఇందులో శర్వాకి జోడీగా ముగ్గురు భామలు నటిస్తున్నారు. సాక్షి వైద్య, సంయుక్త మీనన్ తో పాటు మరో భామ నటిస్తున్నట్లు సమాచారం. అలాగే శర్వానంద్ 37వ చిత్రం %-%భోగి%-%. సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నాడు. ఇందులో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. మరో హీరోయిన్ కు ఛాన్స్ ఉందని సమా చారం.ఆ పాత్ర కోసం భామను తీసుకోవాలనుకుంటున్నారుట. 1960ల నేపథ్యంలో తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దుల్లో జరిగిన కథ ఆధారంగా రూపొందుతోంది. ఇదొక పీరియడ్ యాక్షన్ డ్రామా అని తెలుస్తోంది. ఈ రెండు చిత్రాలు అప్ డేట్స్ లో కనిపిస్తున్నాయి. 36వ చిత్రం కూడా ప్రకటించారు. కానీ ఇంకా ఈ సినిమా పట్టాలెక్కినట్లు లేదు. ఇందులో కూడా కథానుగుణంగా ముగ్గురు హీరోయిన్లు ఉంటారని సమాచారం.ఇంత వరకూ శర్వానంద్ ఒకేసారి ముగ్గురు హీరోయిన్లతో కలిసి నటించడం జరగలేదు. ఆ రకంగా ఇదే తొలి అనుభవం. గతంలో ఇద్దరు భామల ముద్దుల ప్రియుడిగా నటించాడు కానీ ముగ్గురు భామల ముద్దుల ప్రియుడు అవ్వడం ఇదే తొలిసారి. మరి శర్వా ఆన్ సెట్స్ అనుభవాలు ఎలా ఉన్నాయన్నది త్వరలోనే బయట పడుతుంది.

# నాని హిట్-3 సినిమాకు చిక్కులు

## కథను కాపీ కొట్టారంటూ కోర్టుకెక్కిన రచయిత




నాచురల్ స్టార్ నాని హీరోగా, శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హిట్-3'. మే 1వ విడుదలైన ఈ సినిమా ఘన విజయం సాధించింది. నాని కెరీర్‌లోనే 100 కోట్ల క్లబ్‌లో చేరింది. అయితే తాజాగా ఈ సినిమా చిక్కుల్లో పడింది. ఈ సినిమాలో తన కథను కాపీ కొట్టారని అంటూ.. ఓమహిళ కోర్టుకెక్కింది. హిట్-1, హిట్-2 చిత్రాల సిరీస్‌లో భాగంగా శైలేష్ హిట్-3ని తెరకెక్కించారు. అయితే తన స్టోరీని కాపీ కొట్టారంటూ మహిళా రచయిత విమల్ సోని మద్రాస్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతేకాక విమల్ సోని నానికి వీరాభిమాని అని పేర్కొన్నారు. తాను రాసిన ఏజెంట్ 11, ఏజెంట్ కథల నుంచి హిట్-3 సినిమాను తీశారని ఆమె తెలిపారు. దీంతో హిట్-3 మేకర్స్‌పై కాపీరైట్ కేసు వేశారు. ఆమె రచించిన ఒరిజినల్ కాపీని కోర్టుకు సమర్పించారు. అయితే గతంలో కూడా దర్శకుడు శైలేష్ కొలను ఇలాంటి వివాదాన్ని ఎదురుకున్నారు. వెంకటేష్ హీరోగా ఆయన 'సైంధవ్' అనే సినిమాను తెరకెక్కించిన విషయం తెలిసిందే. ఈ సినిమా కథను కూడా కాపీ కొట్టారు అంటూ అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.

# గ్యాప్ ను బ్యాలెన్స్ చేయబోతున్న కీర్తి



మహానటి సినిమాతో తిరుగులేని నటిగా ప్రూవ్ చేసుకున్న కీర్తి, కెరీర్ బాగా రన్ అవుతున్న టైమ్ లో పెళ్లి చేసుకుని మ్యారేజ్ లైఫ్ లోకి అడుగుపెట్టింది. పెళ్లికి ముందు కీర్తి సురేష్ బాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తూ చేసిన బేబీ జాన్ సినిమాలో కెరీర్లో ఎన్నడూ లేనంతగా గ్లామర్ ఒలకబోసింది. కానీ ఆ సినిమా ఫ్లాప్ అవడంతో కీర్తి చేసిన గ్లామర్ షో మొత్తం వేస్ట్ అయిపోయింది. బేబీ జాన్ తో పాటూ పెళ్లికి ముందు కీర్తి చేసిన అక్క వెబ్ సిరీస్ లో కూడా అమ్మడు కాస్త హాట్ గానే కనిపించనుందని తెలుస్తోంది. అయితే పెళ్లి తర్వాత కొన్నాళ్ల పాటూ మ్యారేజ్ లైఫ్ ను ఎంజాయ్ చేయాలనే ఉద్దేశంతో రెస్ట్ లో ఉన్న కీర్తి ఇప్పుడు మళ్లీ కెరీర్ ను ఫుల్ స్పీడ్ లో పరుగులు పెట్టించాలని చూస్తోందట. అందులో భాగంగానే మళ్లీ తన కెరీర్ పై ఫోకస్ చేయబోతుందని తెలుస్తోంది బాక్సాఫీస్ వద్ద వచ్చిన గ్యాప్ ను బ్యాలెన్స్ చేయడానికి కీర్తి వరుస సినిమాలతో ప్రేక్షకుల్ని పలకరించబోతున్నట్టు సమాచారం. అందులో భాగంగానే లేడీ ఓరియెంటెడ్ సినిమాగా తెరకెక్కిన రివాల్వర్ రీటా సినిమాను ఆగస్ట్ 27న రిలీజ్ చేయనున్నట్టు రీసెంట్ గా అనౌన్స్‌మెంట్ వచ్చింది. దీని కంటే ముందుగా సుహాస్ తో చేసిన ఉప్పు కప్పురంబు సినిమాతో ఆడియన్స్ ను పలకరించనుంది కీర్తి. అయితే ఉప్పు కప్పురంబు సినిమా థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో రిలీజ్ కానుంది. జులై 4 నుంచి ప్రైమ్ వీడియోలో ఉప్పు కప్పురంబు స్ట్రీమింగ్ కు రానున్నట్టు మేకర్స్ రీసెంట్ గానే అనౌన్స్ చేశారు. అక్క సిరీస్ ను కూడా నెట్‌ఫ్లిక్స్ త్వరలోనే రిలీజ్ చేయాలని చూస్తోన్నట్టు తెలుస్తోంది. అవి కాకుండా తమిళంలో కన్నివీడి చేస్తోంది. అలాగే విజయ్ దేవరకొండ రౌడీ జనార్ధన, బలగం వేణు ఎల్లమ్మలో కూడా కీర్తి ఆల్మోస్ట్ ఫైనల్ అయిందని టాక్. వీటితో పాటూ బాలీవుడ్ లో కూడా కీర్తి ఓ సినిమా చేస్తున్నట్టు తెలుస్తోంది. మొత్తానికి కీర్తి సురేష్ బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో త్వరలోనే ఆడియన్స్ ను అలరించబోతుంది.

## అల్లు అర్జున్, అట్లీ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్

# యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ?



పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ హీరోగా కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ డైరెక్షన్ లో సినిమా వస్తున్నా సంగతి తెలిసిందే. బన్నీ కెరీర్ లో 22వ సినిమాగా వస్తున్న ఈ సినిమాపై ఇప్పటి నుండే అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. కోలీవుడ్ బిగ్గెస్ట్ ప్రొడక్షన్స్ లో ఒకటైన సన్ పిక్చర్స్ అత్యంత భారీ బడ్జెట్ పై ఈ సినిమాను నిర్మిస్తోంది. దీపికా పాడుకొనే, మృణాల్ ఠాకూర్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు.కాగా ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ ఎవరు అనే క్యూరియాసిటీ నెలకొంది. అనిరుధ్, సాయి అబ్యాంకర్ వీరి ఇద్దరు పేర్లు గత కొన్ని నెలలుగా వినిపిస్తున్నాయి. కానీ ఎవరిని లాక్ చేయలేదు మేకర్స్. ఇప్పుడు అందుతున్న విస్వసనీయ సమాచారం ప్రకారం అల్లు అర్జున్, అట్లీ సినిమాకు కోలీవుడ్ యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ను ఫిక్స్ చేసారని తెలిసింది. త్వరలోనే ఈ విషయాన్నీ అధికారకంగా ప్రకటించ బోతున్నారట మేకర్స్. కోలీవుడ్ లో ఇప్పుడు సాయి సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాడు. ఇప్పటికే సూర్య నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం కరుప్పు తో పాటు లోకేష్ కనగరాజ్ నిర్మిస్తున్న బెంజ్, ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్ సినిమాలకు మ్యూజిక్ అందిస్తున్నాడు. ఇప్పుడు అల్లుఅర్జున్ ? అట్లీ కాంబోకు కు కూడా ఈ యువ సంచలం మ్యూజిక్ ఇస్తుండడం మనోడి క్రేజ్ ఎలా ఉందో తెలుస్తోంది.